శుక్రవారం
24-05-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 332
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

బ్రూనేలో భారతీయుడికి ఆరు నెలల జైలు

బందర్ సెరీ బెగావన్: బ్రూనేలో ఇమిగ్రేషన్ నేరం కింద ఐదుగురికి జైలు శిక్ష పడింది. వీరిలో ఒకరు భారతీయుడు ఉన్నట్లు ఇమిగ్రేషన్ & నేషనల్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (ఐఎన్ఆర్‌డీ) బ్రూనే దరుస్సలమ్ పేర్కొంది. పరిమితి కాలానికి మించి దేశంలో ఉన్నందుకు 60ఏళ్ల భారతీయుడికి ఆరు నెలల జైలు శిక్ష పడినట్లు వెల్లడించింది. అలాగే 64ఏళ్ల ఫిలిపీన్స్‌కు తొమ్మిది నెలల జైలు, 800 బ్రూనే డాలర్లు అంటే సుమారు 590 అమెరికన్ డాలర్ల జరిమానా విధించినట్లు తెలిపింది. జరిమానా చెల్లించలేకపోయిన కారణంగా ఆయన శిక్షను పది నెలలకు పెంచినట్లు స్థానిక వార్తాసంస్థ బోర్నియో బులెటిన్ పేర్కొంది.

పోలీసులకు సవాల్



- సెల్, కారు, గన్‌మెన్‌లను వదలి అజ్ఞాతంలోకి 'పిన్నెల్లి'
- అరెస్ట్ జాప్యంపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్
- తెలుగు రాష్ట్రాల్లో 8 బృందాలతో ముమ్మర గాలింపు
- రెండు రోజులుగా అంతుచిక్కని రామకృష్ణారెడ్డి జాడ
- అరెస్ట్ చేసి తీరుతామన్న సీఈవో మీనా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్ పోలీసులకు సవాల్‌గా మారింది. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం ఘటనలో పిన్నెల్లిపై 10 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం పిన్నెల్లిని తక్షణమే అరెస్ట్ చేయాలని రాష్ట్ర పోలీసులను ఆదేశించింది. దాంతో పిన్నెల్లిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. పిన్నెల్లి మాత్రం సినీఫక్కీలో తప్పించుకు తిరుగుతున్నారు. ఆయన ఫోన్, కారు, గన్‌మెన్‌లను సైతం వదిలేసి అజ్ఞాతంలోకి వెళ్లడంతో పోలీసులకు ఆయన జాడ అంతుచిక్కడం లేదు. ప్రస్తుతం ఆయన ఆచూకీ కోసం 8 ప్రత్యేక పోలీస్ బృందాలు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో జల్లెడ పడుతున్నాయి. చెన్నై, బెంగళూరుల్లో ఉన్న ఆయన సన్నిహితులనూ వాకబు చేస్తున్నారు. అయితే పిన్నెల్లి తప్పించుకోవడానికి పోలీస్ అధికారులే కొందరు సహకరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈనెల 13వ తేదీన పోలింగ్ సందర్భంగా ఈవీఎం మిషన్‌ను పిన్నెల్లి ధ్వంసం చేయడంతోపాటు... ఆ తర్వాత రోజు కూడా మాచర్ల నియోజకవర్గంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించిన తర్వాతే స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈసీ ఆదేశంతో ఈనెల 15వ తేదీన పిన్నెల్లి సోదరులిద్దరినీ గృహనిర్బంధం చేశారు. అయినా వారిద్దరూ పోలీసుల కళ్లుగప్పి ఇంట్లోంచి పరారయ్యారు. ఇందుకు కొందరు పోలీసులు సహకరించారని ప్రత్యర్థులు ఆరోపించారు. అలాగే హైదరాబాద్ ఇస్నాపూర్‌లోని ఒక గెస్ట్ హౌస్‌లో ఆయన ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేసేందుకు వెళ్లిన పోలీసులను పిన్నెల్లి మరోసారి బురిడీ కొట్టించారు. ఆయన కారును పోలీసులు వెంబడించగా, కొద్దిదూరం తర్వాత ఆయన తన సెల్, గన్‌మెన్‌లు, కారును వదిలేసి అదృశ్యమయ్యారు. దీనికి కూడా పోలీసుల సహకారమే కారణంగా పేర్కొంటున్నారు. గన్‌మెన్‌లకు వాస్తవం తెలిసే అవకాశం ఉన్నప్పటికీ వారు తమకేం తెలియదని బుకాయిస్తున్నారు. మరోవైపు పిన్నెల్లి అరెస్ట్ జాప్యంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంతో రాష్ట్ర డీజీపీ. సీఈఓ ద్వారా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసేందుకు 8 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. పిన్నెల్లిపై మొత్తం 10 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి

- మిగతా 2 లో

పిన్నెల్లికి ఊరట

5 వరకు చర్యలొద్దని హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలింగ్ రోజు ఈవీఎంను ధ్వంసం చేసిన కేసులో ఏ1 నిందితుడిగా ఉండి... ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. జూన్ 5వ తేదీ వరకు పిన్నెల్లిపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేసింది. ఈవీఎంలను ధ్వంసం చేసిన కేసులో పిన్నెల్లిపై మొత్తం 10 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు, అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో గురువారం పిన్నెల్లి ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు విచారణ ప్రారంభించింది. పిన్నెల్లికి ముందుగా నోటీసులు ఇవ్వకుండా అరెస్ట్ చేయడం తగదని ఆయన తరపు న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదించారు. 'ఎక్స్'లో నారా లోకేశ్ ఈవీఎం ధ్వంసం చేసిన వీడియో పోస్ట్ చేశారు. ఆ వీడియో ఆధారంగా కేసు నమోదు చేశారు. దీనిపై నోటీసులు ఇవ్వకుండా అరెస్టుకు వెళ్లడం సరికాదు. లోకేశ్ ట్విట్టర్ లో పెట్టిన వీడియో ఆధారంగా పిన్నెల్లిని అరెస్ట్ చేయడం అన్యాయమని వాదించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈవీఎం ధ్వంసం చేశారని పోలింగ్ అధికారి చెప్పారని... పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లో కూడా ఇవే అంశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న నారా లోకేశ్ ట్విట్టర్‌లో

- మిగతా 2 లో

చలో మాచర్ల భగ్నం

ఎక్కడికక్కడే టీడీపీ నేతల గృహ నిర్బంధం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మాచర్ల నియోజకవర్గంలో వరుసగా రెండు రోజులపాటు కొనసాగిన హింసాత్మక ఘటనల్లో బాధితులను పరామర్శించేందుకు గురువారం తెలుగుదేశం పార్టీ చేపట్టిన చలో మాచర్ల కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. పోలింగ్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 9 ఈవీఎంలు ధ్వంసం కాగా, వాటిలో ఏడు ఈవీఎంలు ఈ నియోజకవర్గంలోనే ధ్వంసమయ్యాయి. అలాగే రెండు రోజులపాటు జరిగిన అల్లర్లలో 8 కేసులు నమోదు కాగా, వాటిలో 296 మందిని నిందితులుగా గుర్తించారు. ఇక ఘర్షణల కారణంగా టీడీపీకి చెందిన అనేక కుటుంబాలు భయంతో గ్రామాలు వదిలిపెట్టాయి. ఈ నేపథ్యంలో అక్కడి బాధితులకు భరోసా కల్పించేందుకు టీడీపీ చలో మాచర్ల కార్యక్రమం చేపట్టింది. అయితే పోలీసులు అక్కడ 144 సెక్షన్ అమలు చేస్తుండడం, ఘర్షణలు నివారించేందుకు ఇప్పటికే రెండు పార్టీల నేతలను గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ క్రమంలో ఆ పార్టీ

- మిగతా 2 లో

ఓట్ల లెక్కింపునకు భారీ భద్రత

- తొలుత పోస్టల్ బ్యాలెట్లు... ఆతర్వాతే ఈవీఎంలు
- త్వరితగతిన ఫలితాల వెల్లడికి ఏర్పాట్లు
- పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి టేబుళ్లు
- పాత్రికేయుల కోసం ప్రత్యేక కేంద్రాలు
- జిల్లా కలెక్టర్లకు సీఈవో ముకేశ్‌కుమార్ మీనా ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వచ్చే నెల 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులైన కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముకేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ కచ్చితమైన

- మిగతా 2 లో

పోలింగ్ కేంద్రాల వారీగా
డేటా ఇవ్వలేం

సుప్రీంకు ఈసీ అఫిడవిట్

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల వివిధ దశల్లో నమోదవుతున్న పోలింగ్ శాతాలపై కచ్చితమైన అధికారిక సమాచారాన్ని ఎన్నికల సంఘం(ఈసీ) సకాలంలో ఇవ్వలేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అంశంపై సుప్రీంకోర్టులోనూ పిటీషన్ దాఖలైంది. దీనికి కేంద్ర ఎన్నికల సంఘం సమాధానమిచ్చింది. ఎన్నికలు

- మిగతా 2 లో

ఏపీలో సీఎం ఎవరో
నిర్ణయించేది మోదీయే

- చంద్రబాబు ఉత్సవ విగ్రహం
- దక్షిణాదిలో బీజేపీకి అవకాశాలు లేవు
- '400 పార్' మిథ్య - 200 స్థానాలు మించవు
- మోదీ అవినీతి పాలనకు తెర
- రాబోయేది 'ఇండియా' ప్రభుత్వం
- సీపీఐ కార్యదర్శి నారాయణ



విజయవాడ: 'ఎవరు ఎటు పోతే మాకెందుకు... మాకు కావాల్సింది అధికారం' అన్నట్లుగా దేశంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ వైఖరిగా ఉందని సీపీఐ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. సంక్షేమ పథకాలు ఇచ్చినందున మహిళా ఓట్లు తమ పార్టీకే వస్తాయని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి...అంతకన్నా ఎక్కువ ఇస్తామని చెప్పాము కాబట్టి మహిళలు తమకు మొగ్గు చూపుతారని టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీతో పొత్తు పెట్టుకొని చంద్రబాబు ఉత్సవ విగ్రహంగా మారారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ సామ్రాజ్యం నడుస్తోందని వ్యాఖ్యానించారు. ఈసారి మధ్యతరగతి, ఎన్నారైల ఓటింగ్ పెరిగిందని చెప్పారు. స్ట్రాంగ్‌రూమ్‌లకు భద్రత సరిగ్గా లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. బీజేపీ 400 పార్‌ను మిథ్యగా నారాయణ అభివర్ణించారు. ఆ పార్టీకి దక్షిణాది

- మిగతా 2 లో

బంగాళాఖాతంలో
అల్పపీడనం

రెండ్రోజులు వర్షాలు

విజయవాడ: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారుతోందని వాతావరణ విభాగం తెలిపింది. ఈ నెల 26 తేదీ సాయంత్రానికి అది మరింత బలపడుతుందని, ఈశాన్యంగా కదులుతూ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారనున్నప్పటికీ దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి ముప్పేమీ లేదని వాతావరణశాఖ

- మిగతా 2 లో

గ్రీస్ వర్సిటీ ఎన్నికల్లో పన్స్‌పాడాస్టికి కేఎస్ విజయం 2లో

ఇదీ లోకం!

నాకర్థమయిపోయింది, మీ పార్టీ గెలిచినా గెలవకపోయినా,పందాల కోసం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు కదూ!

ముగిసిన ఏపీ ఈఏపీసెట్

- ఇంజనీరింగ్‌లో 94.22 శాతం హాజరు
- అగ్రికల్చర్, ఫార్మశీ-91.12 శాతం
- నేడు ఇంజనీరింగ్ కీ విడుదల

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: జేఎన్టీయూ-కాకినాడ అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మశీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపిసెట్)-2024 పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన పరీక్షలు గురువారం వరకు కొనసాగాయి. ఏపీలోని అన్ని జిల్లాలతోపాటు హైదరాబాద్‌లో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏపీ ఈఏపీసెట్-2024కు ఇంజనీరింగ్ విభాగంలో అన్ని సెషన్లకు కలిపి మొత్తంగా 2,74,213 మంది విద్యార్థులకు గాను 2,58,373 మంది పరీక్షకు హాజరయ్యారు. 15840 మంది గైర్హాజరయ్యారు. 94.22 శాతం హాజరు నమోదైంది. అగ్రికల్చర్, ఫార్మశీ విభాగంలో అన్ని సెషన్లకు 88,638 మంది విద్యార్థులకు గాను 80,766 మంది పరీక్ష రాయగా... మరో

- మిగతా 2 లో

ఢిల్లీవైపే అందరి చూపు

ఆరోదశ ఎన్నికలకు ముగిసిన ప్రచారం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఆరోదశ ఎన్నికలకు ప్రచారం ముగిసింది. ఈనెల 25న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తం 8 రాష్ట్రాల్లో 58 నియోజకవర్గాలకు శనివారం ఉదయం 7గంటల నుంచి పోలింగ్ జరగనుంది. మొత్తం 889 మంది అభ్యర్థులు అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇందులో హర్యానా, ఢిల్లీ సీట్లు ఉన్నాయి. ఢిల్లీలో ఏడు స్థానాలకు, యూపీలో 14, హర్యానాలోని 10 లోక్‌సభ స్థానాలకు

- మిగతా 2 లో

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఏడుగురు మావోయిస్టుల మృతి
- తుపాకుల మోతతో దద్దరిల్లుతోన్న దండకారణ్యం

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి తూటాల వర్షం కురుస్తోంది. దండకారణ్యం కాల్పుల మోతతో దద్దరిల్లి తోంది. ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకోగా... తాజాగా భద్రతా బలగాలు మరో భారీ ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో ఏకంగా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈసారి ఏకంగా మావోయిస్టుల స్థావరంపైనే భద్రతా బలగాలు దాడి

- మిగతా 2 లో

ప్రజ్వల్... లొంగిపో...

దేవెగౌడ హెచ్చరిక

బెంగళూరు: లైంగిక దౌర్జన్యం కేసు ఎదుర్కొంటున్న హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఆచూకీ ఇంకా తెలియడం లేదు. విదేశాల్లో ఉన్న ఆయనను రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండగా... ఆయన కుటుంబీకుల నుంచి వరుస విజ్ఞప్తులు వస్తున్నాయి. ఈ క్రమంలో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మరోసారి స్పందించారు. ఎక్కడున్నా తక్షణమే వచ్చి పోలీసుల ముందు లొంగిపోవాలని, తన సహనాన్ని పరీక్షించొద్దని, లేదంటే తన ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ప్రజ్వల్‌ను

- మిగతా 2 లో

రైసీకి అంతిమ వీడ్కోలు

తెహ్రాన్: ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ అంత్యక్రియలు గురువారం సాయంత్రం ముగిశాయి. రజావీ ఖోంరాసన్ ప్రావిన్స్‌లోని ఆయన స్వస్థలమైన మషాద్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఉన్నతాధికారుల సమక్షంలో అంతిమ సంస్కారాలు జరిగాయి. మషాద్ నగరంలోని ఇమామ్ రెజా పుణ్యక్షేత్రంలో రైసీని ఖననం చేశారు. ఆ ప్రాంతంలో ఖననమైన తొలి రాజకీయ నాయకుడిగా రైసీ నిలిచారు. మషాద్‌కు తరలించడానికి ముందు బిర్జాండ్‌లో నిర్వహించిన అంతిమ యాత్రలో నల్ల వస్త్రాల్లో జనం పాల్గొన్నారు. వేలాది మంది వాహనం వెంట నడిచారు. ఆయన శవపేటికను తాకేందుకు ప్రయత్నించారు. దానిపైకి పూలు, స్కార్ఫ్‌లు విసిరారు. కాగా, విమాన దుర్ఘటనలో రైసీతో పాటు ప్రాణాలు కోల్పోయిన విదేశాంగ మంత్రి అమీర్ అబ్దుల్లాహియన్ అంత్యక్రియలు కూడా తెహ్రాన్‌లోని మషగ్ స్వేర్‌లో ముగిశాయి. కుటుంబ సభ్యులు, విదేశాంగ వ్యవహారాల శాఖ సిబ్బంది సమక్షంలో ఆయనను రే నగరంలోని షా అబ్దుల్ అజీమ్ హుస్సేనీ పుణ్యక్షేత్రంలో ఖననం చేసినట్లు అధికారులు వెల్లడించారు. అంతకుముందు విదేశీ ప్రతినిధులు ఇరాన్ అధ్యక్షుడితో సహా మిగతావారికి నివాళులర్పించారు. భారత ఉపరాష్ట్రపతి ధన్కర్ కూడా రైసీకి అంజలి ఘటించారు. ఆదివారం రైసీ ప్రయాణించిన హెలికాప్టర్ కూలిపోగా మొత్తం ఎనిమిది మంది చనిపోయారు.

మెక్సికో ఎన్నికల ర్యాలీలో దుర్ఘటన

తొమ్మిది మంది మృతి

మెక్సికో సిటీ: మెక్సికోని న్యూవో లియాన్ రాష్ట్రంలో ఎన్నికల ర్యాలీలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈదురు గాలులకు సభా వేదికలోని ఓ భాగం ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఓ చిన్నారితో సహా తొమ్మిది మంది దుర్మరణం చెందారు. మరో 63 మందికి గాయాలయ్యాయి. మెక్సికోలో అధ్యక్ష ఎన్నికలు కోసం సెంటర్-లెఫ్ట్ అధ్యక్ష అభ్యర్థి జార్జ్ అల్వరేజ్ మయ్‌నెజ్ ప్రచార ర్యాలీలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆయన తన మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో గాలి బాగా వీయడంతో వేదిక ఓ వైపుకు ఒరిగిపోయింది. దాని మీద ఉన్న వారితో సహా వేదికకు దగ్గరగా ఉన్న వారంతా గాయపడ్డారు. ఐదు వేల మంది కార్యక్రమానికి హాజరయ్యారు.గాయపడిన వారిని హుటాహుటిన సమీప ఆసుపత్రులకు తరలించగా చాలా మందికి కాళ్లు, చేతులు విరిగినట్లు తెలిసింది. వర్షం, ఈదురు గాలి కారణంగా ఈ ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

26న ద.కొరియా, చైనా, జపాన్ భేటీ

సియోల్: దక్షిణ కొరియా, చైనా, జపాన్ త్రైపాక్షిక సదస్సు ఈనెల 26న జరగబోతోంది. ఈ మూడు దేశాల అధినేతలు యూన్ సుక్ యోల్, లి కియాంగ్, ఫుమియో కిషిదా ఐదేళ్ల తర్వాత మొదటిసారి భేటీ కాబోతున్నారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఈ సమావేశం జరగనుంది. ఈ మేరకు దక్షిణ కొరియా అధ్యక్ష కార్యాలయం గురువారం ప్రకటించింది. ఆదివారం ముగ్గురు ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని వెల్లడించింది. 2008లో తొలి త్రైపాక్షిక సదస్సు నిర్వహించారు. 2019 డిసెంబరులో చైనాలో చివరి సారి వీరు భేటీ అయ్యారు. ఆ తర్వాత సమావేశం కాలేదు. ఆసియా పొరుగు దేశాల మధ్య సత్సంబంధాలు, సహకారాన్ని మరింత పెంపొందించుకోవడమే ఈ సమావేశం ముఖ్యఉద్దేశం.

గ్రీస్ వర్సిటీ ఎన్నికల్లో 'పన్స్‌పొడాస్టికి కేఎస్' విజయం

వరుసగా మూడోసారి గెలిచిన కేకేఈ విద్యార్థి సంఘం

ఏథెన్స్: గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) యువజన శాఖ కేఎన్‌ఈ మద్దతున్న 'పన్స్‌పొడాస్టికి కేఎస్' (ఆల్ స్టూడెంట్ కోఆపరేషన్ మూవ్‌మెంట్) వరుసగా మూడోసారి విజయఢంకా మోగించింది. ఈనెల 22న దేశంలోని అన్ని యూనివర్సిటీలు, టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లలో జరిగిన విద్యార్థి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించింది. జూన్ 9న యూరోపియన్ పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. అందుకు 18 రోజుల ముందు వర్సిటీ ఎన్నికల ఫలితాలు వెలువడటం, పన్స్‌పొడాస్టికి కేఎస్ విజయం సాధించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. యూరోపియన్ పార్లమెంటు ఎన్నికలపై దీని ప్రభావం ఉండబోతోంది. పన్స్‌పొడాస్టికి కేఎస్ 47.08శాతం ఓట్లతో గెలిచింది. సమీప ప్రత్యర్థి డీఏపీకి 18.51శాతం, సోషల్ డెమొక్రటిక్ పీఏఎస్పీకి 3.15శాతం చొప్పున ఓట్లు పోలయ్యాయి. అలాగే లెఫ్టిస్ట్ ఈఏఏకే-ఏఆర్‌ఈఎన్‌కు 6.32 శాతం, సిరిజా-డిక్ట్యోకు 0.81శాతం చొప్పున ఓట్లు వచ్చాయి. 2023లోనూ పన్స్‌పొడాస్టికి కేఎస్‌కు 44.63శాతం ఓట్లు వచ్చాయి. డీఏపీకి 23.04 శాతం ఓట్లు లభించాయి.

పిన్నెల్లికి ఊరట

(మొదటిపేజీ తరువాయి)

వీడియో మార్ఫింగ్ చేసి ఉండొచ్చని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్లు అయినప్పటికీ పిన్నెల్లికి ముందస్తు బెయిల్ ఇవ్వవచ్చునన్నారు. సుప్రీంకోర్టు అర్నేష్ కుమార్ కేసులో మార్గదర్శక సూత్రాల ప్రకారం ఏడేళ్లలోపు శిక్షపడే సెక్షన్లు ఉంటే 41ఏ నోటీసులు ఇవ్వాలని ఉందని గుర్తు చేశారు. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఈ క్రమంలో పిన్నెల్లిపై జూన్ 5వరకు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు జడ్జి జ్యోతిర్మయి ఆదేశాలిచ్చారు.

రీపోలింగ్ పిటిషన్లు డిస్మిస్

రీపోలింగ్ జరపాలని కోరుతూ మంత్రి అంబటి రాంబాబు, చంద్రగిరి వైకాపా అభ్యర్థి మోహిత్‌రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన రెండు పిటిషన్లను ఏపీ హైకోర్టు డిస్మిస్ చేసింది. పోలింగ్ రోజు హింసాత్మక ఘటనల నేపథ్యంలో సత్తెనపల్లిలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని మంత్రి అంబటి ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. మరో వైపు తిరుపతి జిల్లా చంద్రగిరిలో రీపోలింగ్ నిర్వహించాలని మోహిత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది.

పోలింగ్ కేంద్రాల వారీగా డేటా ఇవ్వలేం

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్న సమయంలో పోలింగ్ కేంద్రాల వారీగా డేటాను వెబ్‌సైట్‌లో వెల్లడిస్తే అది గందరగోళ పరిస్థితులకు దారితీస్తుందని పేర్కొంది. ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానానికి అఫిడవిట్ దాఖలు చేసింది. సార్వత్రిక ఎన్నికల ప్రథమ, ద్వితీయ దశల పోలింగ్ శాతాలను అధికారికంగా వెల్లడించడంలో తీవ్ర జాప్యం జరగడం, ఆ గణాంకాలను సవరించడంపై సందేహాలు వ్యక్తమయ్యాయి. దీంతో ప్రతి విడతలో పోలింగ్ ముగిసిన 48 గంటల్లోనే కేంద్రాలవారీ ఓటింగ్ శాతాలను ఈసీ వెబ్‌సైట్‌లో ప్రచురించేలా చూడాలని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం... ఈసీకి కీలక ప్రశ్నలు సంధించింది. వీటికి వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఈసీ కోర్టుకు 225 పేజీల్లో తమ వివరణ సమర్పించింది. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పడిన ఓట్ల సంఖ్య తెలిపే 'ఫామ్ 17సీ' పత్రాన్ని బహిర్గతం చేయాలని నిబంధనల్లో లేదని, ప్రస్తుతం ఈ 17సీ ఒరిజినల్‌ను స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరుస్తున్నామని ఈసీ తెలిపింది. కేవలం పోలింగ్ ఏజెంట్‌కు మాత్రమే దాని కాపీ పొందేందుకు అనుమతి ఉంటుందని, అది కూడా వారి సంతకంతో ఇస్తామని చెప్పింది. అలా కాకుండా పిటిషనర్ కోరినట్లుగా పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ శాతాన్ని బహిరంగంగా ప్రచురిస్తే దాన్ని దుర్వినియోగం చేసే అవకాశముందని, వాటి చిత్రాలను, కౌంటింగ్ ఫలితాలను మార్ఫింగ్ చేసే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. ఈ డేటాను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల ఎన్నికల యంత్రాంగంలో గందరగోళ పరిస్థితులు నెలకొంటాయని, దీనివల్ల మొత్తం ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అపనమ్మకం ఏర్పడుతుందని ఈసీ సమాధానంలో పేర్కొంది. ఈ ఫామ్ 17సీని ఏ సంస్థకు ఇచ్చేందుకు అనుమతులు లేవని స్పష్టం చేసింది. తొలి రెండు దశల్లో పోలింగ్ శాతాలపై పిటిషనర్ చేసిన ఆరోపణలను ఈసీ కొట్టిపారేసింది. అవన్నీ అవాస్తవమని, తప్పుదోవ పట్టించేవని ఆరోపించింది. పోలింగ్ డేటాలో హెచ్చుతగ్గులు ఉన్నట్లు వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని, 2019లోనూ ఇదే తరహా ఆరోపణలతో పిటిషన్లు దాఖలయ్యాయని చెబుతున్నారని, అందుకు ఒక్క ఉదాహరణ కూడా వారు ప్రస్తావించలేదని తెలిపింది. కేవలం అనుమానంతో మాత్రమే తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు స్పష్టమవుతోందని ఈసీ పేర్కొంది. ఈ వ్యవహారంపై తదుపరి విచారణ మే 24న జరగనుంది.

ముగిసిన ఏపీ ఈఏపీసెట్

(మొదటిపేజీ తరువాయి)

7872మంది గైర్హాజరయ్యారు. 91.12శాతం హాజరు నమోదైంది. అన్ని విభాగాలు కలిపి 3,62,851 మంది విద్యార్థులకు గాను 3,39,139 మంది పరీక్షకు హాజరయ్యారు. 23712 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరు కాలేదు. హాజరు శాతం 93.47 నమోదైంది. ఏపీ ఈఏపీసెట్ చైర్మన్, జేఎన్టీయూ-కాకినాడ ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు.

వెబ్‌సైట్‌లో అగ్రికల్చర్, ఫార్మసీ కీ: కన్వీనర్ వెంకటరెడ్డి

గతేడాది కంటే..ఈ ఏడాది ఏపీ ఈఏపీసెట్ ప్రవేశ పరీక్షకు అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడంతో పాటు పరీక్షలో హాజరు శాతం కూడా గణనీయంగా పెరిగిందని ఏపీ ఈఏపీసెట్ 2024 కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి ప్రాథమిక 'కీ'ని విడుదల చేయడంతో పాటు రెస్పాన్స్ షీట్లను వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటల వరకు ప్రాథమిక 'కీ'పై విద్యార్థులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి శుక్రవారం ఉదయం 10గంటలకు ప్రాథమిక కీను విడుదల చేస్తామని, దీంతో పాటు రెస్పాన్స్ షీట్లను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని వివరించారు. ఈనెల 26వ తేదీ ఉదయం 10గంటల వరకు ప్రాథమిక కీపై విద్యార్థులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ఏపీ ఈఏపీసెట్-2024 ప్రవేశ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులకు, యూనివర్సిటీ అధికారులకు, కన్వీనర్లు, కో-కన్వీనర్లు, కో-ఆర్డినేటర్లర్లు, ఏపీ ఆన్‌లైన్ సిబ్బందికి ఏపీ ఈఏపీసెట్ చైర్మన్ జీవీఆర్ ప్రసాదరాజు ధన్యవాదాలు తెలిపారు.

వెబ్‌సైట్‌లో ఇంటర్ మార్కులు నమోదు చేసుకోవాలి: కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి

ఏపీ ఈఏపీసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి 25వెయిటేజీ మార్కులను ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా తీసుకోనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రెగ్యులర్ ఇంటర్మీడియట్ విద్యార్థులతోపాటు ఇతర బోర్డులకు చెందిన 10+2 విద్యార్థులు తమ మార్కులను ఏపీ ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని,తద్వారా వారికి ర్యాంకులు కేటాయిస్తామని కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నప్పటికీ,0884-2359599, 0884-2342499 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పోలీసులకు సవాల్

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టు చేసేందుకు పాలనా విభాగం అదనపు ఎస్పీ అధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరంగా చేపడుతున్నాయని తెలిపారు. లుకౌట్ నోటీసులు జారీ చేసి విదేశాలకు పారిపోకుండా ఎయిర్‌పోర్టులను అప్రమత్తం చేశామని నివేదికలో పేర్కొన్నారు. పిన్నెల్లిని త్వరలోనే అరెస్టు చేస్తామని డీజీపీ తెలిపారు.

ఇంకోవైపు నర్సరావుపేట కోర్టులో పిన్నెల్లి గురువారం లొంగిపోతున్నారన్న పుకార్లు వ్యాపించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నరసరావుపేట కోర్టు ఆవరణలో భారీ సంఖ్యలో పోలీసులు పహారా కాశారు. కోర్టు ముగిసే సమయం వరకు వేచి చూసినప్పటికీ పిన్నెల్లి రాకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు.

అరెస్ట్ చేసి తీరుతాం: సీఈవో మీనా

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు విషయంలో ఈసీ సీరియస్‌గా ఉందని, త్వరలోనే అరెస్టు చేసి తీరుతామని సీఈవో ముకేశ్ కుమార్ మీనా స్పష్టం చేశారు. మాచర్ల నియోజకవర్గం పరిధిలోని పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం ఘటనలో సరైన సమాచారం ఇవ్వనందుకు విధుల్లో ఉన్న పీవో, ఏపీవోలను సస్పెండ్ చేయాలని ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసేందుకు ఎస్పీ, డీఎస్పీలతో 8 పోలీసు బృందాలు పనిచేస్తున్నాయన్నారు. మాచర్ల నియోజకవర్గంలో గాయపడిన కార్యకర్తల్ని పరామర్శించేందుకు టీడీపీ నేతలు వెళ్లటం ఇప్పుడు మంచిది కాదని, ఇప్పుడిప్పుడే పరిస్థితులు అదుపులోకి వస్తున్నాయన్నారు. పరామర్శకు ఈ సమయంలో వెళ్లొద్దని రాజకీయ నేతలకు విజ్ఞప్తి చేశారు. బయటి నుంచి నేతలెవరూ పరామర్శకు వెళ్లకూడదని, ఎవరినీ ఆ గ్రామాలకు వెళ్లనీయొద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసిన దృశ్యాలు ఈసీ నుంచి బయటకు వెళ్లలేదని, దర్యాప్తు సమయంలో ఎక్కడో, ఎవరి చేతి నుంచో అవి బయటకు వెళ్లాయని, దానిపైనా విచారిస్తున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈనెల 25 నుంచి స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నట్లు మీనా వెల్లడించారు.

ఓట్ల లెక్కింపునకు భారీ భద్రత

(మొదటిపేజీ తరువాయి)

ఫలితాలను త్వరితగిన ప్రకటించేలా అన్ని ముందస్తు ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా చేసుకోవాలని సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓట్ల లెక్కింపునకు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెదురుమదురు సంఘటనలు మినహా అందరి సమష్టి కృషితో ఈ నెల 13 న రాష్ట్రంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో వచ్చే నెల 4 న జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసుకుని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ముందుగానే లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపులో ఎటువంటి వివాదాలకు తావులేకుండా సంబంధిత వివరాలను ఏ రోజు ఎన్ని గంటలకు, ఎన్ని టేబుళ్లపై ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారనే వివరాలను రాతపూర్వకంగా సంబంధిత అభ్యర్థులకు, ఎన్నికల ఏజెంట్లకు ముందుగానే తెలియజేయాలన్నారు. పాత్రికేయులకు ప్రత్యేకంగా మీడియా సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రాలకు పోలింగ్ యంత్రాలను తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేయాలని... ఎలాంటి సమస్యలు రాకుండా ఉండటానికి బారికేడ్లతో పాటు సూచికల బోర్డులను కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. లెక్కింపు కేంద్రంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలకు వేరు వేరుగా పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి ఓట్ల లెక్కింపు టేబుళ్లను ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు కోసం ప్రత్యేక టేబుళ్లను ఏర్పాటు చేయాలని... ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు చేపట్టి... ఆ తర్వాతే ఈవీఎంల వారీగా పోల్ అయిన ఓట్లను లెక్కించాలన్నారు. ఓట్ల లెక్కింపుకు సుశిక్షితులైన సిబ్బందిని నియమించుకోవాలని, వారికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ముందుగానే నిర్వహించాలని సూచించారు. అదే విధంగా హై స్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యంతో అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లను కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్కోర్ లో ఎప్పటి కప్పుడు డేటా ఎంట్రీకి నిష్ణాతులైన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ అధికారులు, సిబ్బంది వాహనాల పార్కింగ్ కు ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేసుకోవాలని, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది మొబైల్ ఫోన్స్ డిపాజిట్ చేసేందుకు ప్రత్యేకంగా కౌంటర్లను కూడా ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులను, అనధికార వ్యక్తులను, ఇతరుల వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంగణాల్లోకి అనుమతికుంచకుండా పటిష్ఠ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈవీఎం లను భద్రపర్చిన స్ట్రాంగ్ రూముల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో మూడు అంచెల భద్రత కొనసాగుతున్నదని... అయితే స్ట్రాంగ్ రూమ్‌లకు సీలు వేసిన తలుపులు, సెక్యూరిటీ కారిడార్లను కవర్ చేసేలా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును, కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసిన సీసీ కెమెరాల పనితీరును నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తుండాలన్నారు. భద్రత పర్యవేక్షణపై పోలీసు అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదనపు సీఈవోలు పి. కోటేశ్వరరావు, ఎమ్.ఎన్. హరెంధిర ప్రసాద్ తో పాటు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు వారి జిల్లాలనుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

నిర్ణయించేది మోదీయే

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాల్లో సీట్లు వచ్చే అవకాశమే లేదని, దేశం మొత్తం 200 స్థానాలకు మించబోవని నారాయణ తెలిపారు. ఈసారి ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టంచేశారు.

ఆంధ్రప్రదేశ్‌కు కాబోయే ముఖ్యమంత్రి ఎవరన్నది నిర్ణయించేది ప్రధాని మోదీయే గానీ.... ఆయన మళ్లీ ప్రధాని కాగలిగితేనే అది సాధ్యమని నారాయణ అన్నారు. దేశంలో మోదీకి, బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, ఆయన ప్రధాని అయ్యే పరిస్థితి లేదని చెప్పారు. ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని దీమాగా చెప్పారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి సీపీఐ మద్దతిస్తున్నదని, ఆ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్‌ను తప్పుడు కేసులో ఇరికించారని నారాయణ అన్నారు. తనలో సగం ఉండే కేజ్రీవాల్‌ను చూసి మోదీ ఎందుకు భయపడుతున్నారని చమత్కరించారు. మహిళా నేతను అడ్డం పెట్టుకొని ఆప్ పరువు దిగజార్చే ప్రయత్నాలు చేస్తున్నారని స్వాతి మలివాల్ కేసునుద్దేశించి అన్నారు.

ఈసీ తీరు ఆక్షేపణీయం

ఎన్నికల సంఘం వైఖరిని నారాయణ ఖండించారు. ఈసీ పూర్తిస్థాయిలో మోదీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, ఆయన పర్యటలకు అనుకూలంగా షెడ్యూల్ రూపొందించినట్లు ఉన్నదని ఆరోపించారు. నోటికొచ్చినట్లు కులం, మతం అంటూ మోదీ మాట్లాడుతుంటే... ఈసీ సుద్దులు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ప్రధాని హోదాలో ఉండి రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తుండటాన్ని ఆక్షేపించారు. ఈ మధ్య బుల్డోజర్ మాట వినిపిస్తోందన్నారు. తెలంగాణలో బీజేపీ ఎదుగులకు మాజీ సీఎం కేసీఆర్ పద్ధతులే కారణమయ్యాయని విమర్శించారు.

రాజ్యాంగంపై మోదీ బుల్డోజర్

బీజేపీ నేత రాజాసింగ్ గతంలో 'బుల్డోజర్' వ్యాఖ్యలు చేశారని, ఉత్తరప్రదేశ్ నుంచి బుల్డోజర్లు తెలంగాణ మీద దాడి చేస్తాయని బహిరంగంగా ప్రకటించారని నారాయణ గుర్తుచేశారు. యూపీ మూక దాడితో తెలంగాణలో విజయం సాధిస్తామన్నది ఆయన మాటల్లో అర్థమన్నారు. ఇప్పుడు అదే భాషను మోదీ ప్రయోగిస్తున్నారని, కాంగ్రెస్ గెలిస్తే పూరీలోని జగన్నాథుడిపై, అయోధ్య రాముడిపై బుల్డోజర్లతో దాడి చేస్తుందని వ్యాఖ్యానిస్తున్నారని, ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. దేవాలయాలపై కాంగ్రెస్ పార్టీ దాడులు చేస్తుందా? గతంలో చేసిందా? బాబ్రీ మసీదు శిలాన్యాసానికి అనుమతి ఇచ్చినది నాటి ప్రధాని రాజీవ్ గాంధీ కాదా? అలాంటి పార్టీ గెలిస్తే ఆలయాలపై దాడి జరుగుతుందా? అని మోదీని నిలదీశారు. రాజ్యాంగంపై బుల్డోజర్లతో దాడి చేసేది మోదీయేనని వ్యాఖ్యానించారు. గుడిపై దాడి జరిగితే ప్రజలు కాపాడుకోగలరు కానీ రాజ్యాంగంపై దాడి చేస్తే కాపాడేది ఎవరంటూ ఆందోళన వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వానిది కక్షసాధింపు ధోరణి అని అన్నారు. 400 పార్ అంటూ జనాన్ని మభ్యపెట్టే ప్రయత్నాన్ని మోదీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇప్పుడు 300 స్థానాలంటున్నారని, ఆ పార్టీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తన దృష్టిలో బీజేపీకి 200 స్థానాలు మించవన్నారు.

మోదీ ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమన్న అభిప్రాయం దేశ ప్రజల్లో ఉన్నదని చెప్పారు. అవినీతి రహిత పాలన అందిస్తానంటూ అధికారంలోకి వచ్చిన మోదీ... కనీవినీ ఎరుగని రీతిలో అక్రమాలకు తెరతీశారని, గంజాయి స్మగ్లర్‌ను కుబేరుల సరసన చేర్చారని అదానీని ఉద్దేశించి నారాయణ అన్నారు. దేశంలో 29 మంది ఆర్థిక నేరగాళ్లు ఉండగా ఇందులో ఒకరిద్దరు మినహా అందరూ గుజరాత్‌కు చెందిన వారేనని చెప్పారు. ఏదిఏమైనా మోదీ అక్రమ సామ్రాజ్యానికి తెర పడబోతుందని, ఇండియా కూటమి అధికారంలోకి రాబోతుందని నారాయణ అన్నారు.

చలో మాచర్ల భగ్నం

(మొదటిపేజీ తరువాయి)

నేతలు చేపట్టిన 'చలో మాచర్ల'పై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ కార్యక్రమానికి అనుమతి లేదని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ స్పష్టం చేశారు. మాచర్ల వెళ్లకుండా టీడీపీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. గుంటూరులో నక్కా ఆనందబాబు, కనపర్తి శ్రీనివాసరావు ఇళ్ల వద్ద పోలీసులను మోహరించారు. గొల్లపూడిలో దేవినేని ఉమ, విజయవాడలో వర్ల రామయ్యను గృహ నిర్బంధంలో ఉంచారు. ఇక పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన ముఖ్యనేతలందర్నీ హౌస్ అరెస్ట్ చేసి... పల్నాడు జిల్లా సరిహద్దుల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ నేతలెవరూ మాచర్ల నియోజకవర్గంలోకి అడుగుపెట్టకుండా నిరోధించారు.

దివ్యాంగుడి సాహసయాత్ర

పనాజీ: తన ఆశయానికి అంగవైకల్యం అడ్డు కాదని భావించిన 30 ఏళ్ల యువకుడు... ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాడు. ఈ క్రమంలో ఎన్నో సవాళ్లు అధిగమించాడు. ఎవరెస్టు శిఖరాన విజయ సంకేతం చూపించి ప్రపంచ రికార్డు సృష్టించాడు. టింకేశ్ కౌశిక్ తొమ్మిదేళ్ల ప్రాయంలోనే కరెంటు షాక్‌తో రెండు కాళ్లు, ఓ చేయి కోల్పోయాడు. కృత్రిమ అవయవాలు వాడుతున్నాడు. కొన్నేళ్ల క్రితం గోవాకు వచ్చిన కౌశిక్... ఫిట్‌నెస్ కోచ్‌గా పని చేస్తున్నాడు. ఎలాగైనా ఎవరెస్టును అధిరోహించాలని ఆశయంగా పెట్టుకున్నాడు. అందుకోసం తీవ్రంగా శ్రమించాడు. మే 4న నేపాల్ నుంచి సాహసయాత్ర మొదలుపెట్టాడు. మే 11న బేస్ క్యాంపుపై జాతీయజెండా ఎగురవేశాడు. ఈ లక్ష్య సాధనలో అనేక సవాళ్లు ఎదుర్కొన్నట్లు కౌశిక్ చెప్పాడు. ఫిట్‌నెస్ కోచ్ అయినందువల్ల ట్రెక్కింగ్ చాలా తేలిక అని భావించా. కానీ, దానికి సన్నద్ధమవుతోన్న సమయంలో బేస్ క్యాంపు వరకు వెళ్లడం సాహసమేనని గుర్తించా. కానీ, ఎలాగైనా సాధించాలని నిశ్చయించుకున్నా. శారీరక వైకల్యంతోపాటు పర్వతాల్లో ప్రతికూల వాతావరణం బాగా ఇబ్బందిపెట్టింది. అయినప్పటికీ మనోధైర్యంతో ముందుకువెళ్లా. వారం రోజుల పాటు యాత్ర కొనసాగింది. చివరకు ఎవరెస్టు శిఖరాన్ని చేరుకున్నా. అవి నాకెంతో భావోద్వేగ క్షణాలు' అని కౌశిక్ వివరించాడు.

అల్పపీడనం

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేసింది. శుక్రవారం నాటికి వాయుగుండంగా మారనున్న బలమైన అల్పపీడనం కారణంగా రాగల రెండు రోజుల్లో కోస్తాంధ్ర తీర ప్రాంత జిల్లాల్లో చాలా చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిన దృష్ట్యా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ అయ్యాయి. వాయుగుండం ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలోని పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలతోపాటు కాకినాడ, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, సత్యసాయి జిల్లాల్లో చాలా చోట్ల మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడవచ్చని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది.

ఢిల్లీవైపే అందరి చూపు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు జరగనున్నాయి. ఈ విడత అందరి దృష్టి దేశ రాజధాని ఢిల్లీపైనే ఉంది. హస్తినలో బీజేపీ ముమ్మర ప్రచారం నిర్వహించడంతో పాటు మనీ లాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేసిన ఆప్ అధినేత కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై జైలు నుంచి విడుదలై ఇండియా కూటమి అభ్యర్థుల కోసం ప్రచారం నిర్వహించారు. దీంతో ఢిల్లీలో ఎవరు గెలుస్తారన్న ఆసక్తి మరింత పెరిగింది. బీహార్‌లో ఎనిమిది, జమ్మూకశ్మీర్-1, జార్ఖండ్-4, ఒడిశా-6, పశ్చిమబెంగాల్‌లో 8 లోక్‌స్థానాల్లో కూడా ఈ విడతలోనే ఎన్నికలు జరగనున్నాయి. గెలుపుపై ఎన్డీఏ కూటమి, ఇండియా కూటములు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. వచ్చేనెల 1వ తేదీన చివరి దశ ఎన్నికలు జరగనుండగా.. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు రానున్నాయి.

భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

చేశాయి. పోలీసులు, భద్రతా బలగాలు కలిసి మొత్తం 800 మంది చేపట్టిన ఆపరేషన్‌లో ఇప్పటివరకు ఏడుగురు నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. సంఘటనా స్థలంలో భారీగా ఆయుధాల డంప్, పేలుడు పదార్థాలు సహా కీలక వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

చత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో ఈ భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. గురువారం ఐటీబీపీ, ఎస్‌టీఎఫ్, డీఆర్‌జీ, బస్తర్ బెటాలియన్.. స్థానిక పోలీసులు కలిపి మొత్తం 800 మంది భద్రతా బలగాలు ఈ భారీ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. నారాయణపూర్, బీజాపూర్, దంతేవాడ జిల్లాల పరిధిలో నిర్వహించిన గాలింపులో మావోయిస్టుల స్థావరాన్ని గుర్తించి... దానిపై బుల్లెట్ల వర్షం కురిపించారు. దీంతో ఏడుగురు మావోయిస్టులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరికొందరు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఇక భద్రతా బలగాలు జరిపిన కాల్పులకు.. మావోయిస్టులు కూడా తిరిగి ఎదురుకాల్పులకు దిగారు. దీంతో దండకారణ్యం మొత్తం దద్దరిల్లిపోయింది. ఇంకా ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సమాచారం.

లొంగిపొమ్మంటున్న ప్రభుత్వం

ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలవాల్సిందిగా చత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం, హోంమంత్రి విజయ శర్మ మావోయిస్టులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఉదయం విజయ శర్మ బహిరంగ లేఖ విడుదల చేశారు. మావోయిస్టుల పునరావాస విధానంలో మార్పు కోసం వారి నుండి ప్రభుత్వం సూచనలు కోరింది. ప్రభుత్వం ముందు లొంగిపోయే నక్సలైట్లు తమ వివరాలు తెలిపేందుకు డిప్యూటీ సీఎం విజయ్ శర్మ ఈమెయిల్ ఐడీ, గూగుల్ ఫామ్‌ను విడుదల చేశారు. నక్సల్స్ నుంచి సూచనలు కోరుతూ ఈమెయిల్ ద్వారా విజ్ఞప్తులను ప్రభుత్వం స్వీకరిస్తోంది. మావోయిస్టుల లొంగుబాట్లను ప్రోత్సహించేలా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు చత్తీస్‌గఢ్ ప్రభుత్వం చెబుతోంది.

ప్రజ్వల్...లొంగిపో...

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరిస్తూ ఎక్స్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. 'ప్రజ్వల్ రేవణ్ణ గురించి మే 18న ఓ ఆలయానికి వెళ్తూ మీడియాతో మాట్లాడా. అతడు నాకు, నా కుటుంబం, పార్టీ, శ్రేయోభిలాషులకు కలిగించిన బాధ, ఆ దిగ్భ్రాంతి నుంచి కోలుకోవడానికి కొంత సమయం పట్టింది. ఆ కేసులో దోషిగా తేలితే కఠినశిక్ష పడాల్సిందే. నా కుమారుడు, మాజీ సీఎం కుమారస్వామి కూడా ఇదే వైఖరితో ఉన్నాడు. ప్రజ్వల్... ఎక్కడున్నా వచ్చి పోలీసుల ముందు లొంగిపో. నా సహనాన్ని పరీక్షించవద్దు. ఇది నా విజ్ఞప్తి కాదు. హెచ్చరిక. లేదంటే నాతో పాటు కుటుంబసభ్యుల ఆగ్రహానికి గురవుతావ్' అని హెచ్చరిక లేఖలో దేవెగౌడ పేర్కొన్నారు. కొన్ని వారాలుగా ప్రజలు తనపై, తన కుటుంబంపైనా కఠిన పదాలు వాడుతున్న విషయం తెలుసునని దేవెగౌడ వెల్లడించారు. వాస్తవాలు బయటకు వచ్చేవరకు వాటిని ఆపాలని వారికి చెప్పడం ఇష్టం లేదన్నారు. అరవై ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలు తనవెంటే ఉన్నారని, వారికి ఎంతో రుణపడి ఉన్నానని అన్నారు. వారి విశ్వాసాన్ని తిరిగి పొందడమే తనకు ముఖ్యమని మాజీ ప్రధాని స్పష్టంచేశారు. అంతకుముందు ఈ విషయంపై మాజీ సీఎం కుమారస్వామి స్పందిస్తూ తాతపై గౌరవం ఉంటే 48 గంటల్లోగా పోలీసుల ముందు లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. అశ్లీల వీడియోల కేసు అందరినీ తల దించుకునేలా చేసిందని, ఈ ఘటనకు తాను బేషరతుగా ప్రజలను క్షమాపణ కోరుతున్నానని చెప్పారు.

టీడీపీ రిగ్గింగ్ చేసింది

- 60 చోట్ల రీపోలింగ్ చేపట్టాలి
- ఎన్నికల ప్రధాన అధికారికి వైసీపీ ఎమ్మెల్యేల ఫిర్యాదు
- హైకోర్టు, సుప్రీం వరకు పోరాటం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని 16 నియోజకవర్గాలకు సంబంధించి 60 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్‌కు చర్యలు తీసుకోవాలని, పోలీసు రక్షణ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్ మీనాకు వైసీపీ విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ముకేశ్ కుమార్ మీనాకు వైసీపీ ఎంఎల్‌ఏలు కాసు మహేశ్‌రెడ్డి, మల్లాది విష్ణు, శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 13వ తేదీన పోలింగ్ సరళిని బట్టి రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాలలో టీడీపీ బూత్‌ల ఆక్రమణకు పాల్పడిందని, రిగ్గింగ్ చేసిందని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసిందని ఎంకే మీనాకు విన్నవించారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పోలింగ్ సజావుగా జరగాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, తాము రీపోలింగ్ కోరుతున్న బూత్‌లలో లైవ్ వెబ్‌క్యాస్టింగ్ ఫుటేజ్ పరిశీలించాలని కోరారు. ఫుటేజీ ఆధారంగా రీపోలింగ్‌కు ఆదేశించాలన్నారు. ఎవరైతే చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడ్డారో వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని చెప్పారు. మాచర్లలో పాల్వాయిగేట్, తుమ్మకోట, చింతపల్లి, ఒప్పిచర్ల, జెట్టిపాలెం, వెల్దుర్తి ప్రాంతాలలో జరిగిన అల్లర్లు, విధ్వంసకాండపై ఈసీకి ఆరోజే ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. ముఖ్యంగా టీడీపీకి అనుకూలంగా ఉన్న పోలింగ్ బూత్‌లలో పోలీసులను నియమించ లేదని, వైసీపీకి అనుకూలంగా ఉన్న పోలింగ్ బూత్‌లలో డీఎస్పీస్థాయి అధికారులను నియమించి ఓటర్లను స్వేచ్ఛగా ఓటువేయకుండా బెదిరించారని పేర్కొన్నారు. మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎప్పటికప్పుడూ ఈ ఘటనలపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా బేఖాతరు చేశారని, గొడవలు జరుగుతున్న ప్రాంతానికి పోలీసులను పంపలేదని, దానివల్ల హింస చెలరేగిందని వివరించారు. మాచర్లను సమస్యాత్మక నియోజకవర్గంగా గుర్తించి సీఈసీ ఆదేశానుసారం 100 శాతం వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశారని, ఆ వీడియో ఫుటేజ్‌లను పరిశీలించి... తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా వీడియో ఫుటేజీల ఆధారంగా టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, ఇతర అసాంఘిక శక్తులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గురజాల ఎంఎల్‌ఏ కాసు మహేశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా టీడీపీ చేసిన అరాచకాలు, హింసపై ఈసీ సరైన రీతిలో స్పందించకపోతే హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు వెళతామని ప్రకటించారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గురించి ఎన్నికలకు ముందే ఈసీ దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు. ఆయా ప్రాంతాలలో ఓటర్లు సురక్షితంగా ఓటు వేసేలా భద్రత కల్పించాలని కోరామని, అయినా పోలీసులు కానీ, ఎన్నికల అధికారులు కానీ పట్టించుకోలేదని, దీనివల్లే టీడీపీ దౌర్జన్యం, దాడులు, హింసకు పాల్పడిందన్నారు. వారి వెంట వైసీపీ లీగల్ సెల్ నేత శ్రీనివాసరెడ్డి, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఉన్నారు.

ఈసీ...ఈ వీడియో సంగతేంటి?

టీడీపీ నేతల వీడియో విడుదల చేసిన సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పల్నాడుజిల్లా మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ నేతలు ఈవీఎంను పగలగొట్టిన దృశ్యాలతో ఉన్న ఒక వీడియోను వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. తమకు అనేక సందేహాలున్నాయంటూ ఈసీని అనేక ప్రశ్నలు సంధించారు. ఈ సంఘటనతో పల్నాడుజిల్లా రాజకీయం మరోసారి వేడెక్కింది. తుమ్మూరు కోటలో ఈవీఎంలను టీడీపీ నేతలు ధ్వంసం చేసినట్లుగా ఉన్న వీడియోను గురువారం ట్విట్టర్ వేదికగా సజ్జల విడుదల చేశారు. ఈసీ...ఈ వీడియో సంగతేమిటి? అంటూ ప్రశ్నించారు. మాచర్ల నియోజకవర్గంలో మొత్తం 7బూత్‌ల్లో ఈవీఎంలు ధ్వసంమైతే... అందుకు సంబంధించిన వీడియోలను ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. పాల్వాయి వీడియో ఘటన అధికారిక వెబ్ కాస్టింగ్ నుంచి వస్తే... ఎలా లీక్ అయిందో చెప్పాలన్నారు. ఈనెల 20న ఫిర్యాదు నమోదైందని ఈసీ వివరణ ఇచ్చిందని, ఇంతకాలంపాటు ప్రిసైడింగ్ ఆఫీసర్ ఏం చేశారు?... మిగతా వీడియోల సంగతేమిటి? వాటన్నిటిని ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉందనేది ఈసీ ఎందుకు దాచిపెడుతోందని ప్రశ్నించారు.

నిందితులను కఠినంగా శిక్షించండి

విద్యార్థినిపై అత్యాచారం... మహిళా కమిషన్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి మార్కుల జాబితా తీసుకెళ్లేం దుకు పాఠశాలకు వచ్చిన విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి తక్షణమే స్పందించారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండ లంలో జరిగిన ఈ అఘాయిత్యంపై జిల్లా ఎస్పీకి గురు వారం ఆమె ఫోన్ చేసి పోక్సో చట్టం కింద నిందితులపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని, షెల్టర్ హోమ్ ద్వారా రక్షణ కల్పించాలని జిల్లా అధికారులకు సూచించారు. అండగా ఉంటామని బాధితురాలి తల్లికి ఆమె భరోసా ఇచ్చారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన అమానవీయ సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. పదో తరగతి మార్కుల జాబితాను తీసుకెళ్లేందుకు పాఠశాలకు వచ్చిన బాలిక(15)ను సహచర విద్యార్థి(15) తరగతి గదిలోకి లాక్కెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడని చెప్పారు. ఈ ఘటనను నలుగురు యువకులు ఫోన్‌లో వీడియో తీసి తమ కోర్కెను తీర్చాలని బెదిరింపులకు పాల్పడ్డారని ఆమె పేర్కొన్నారు. బాధితు రాలి తల్లి పోలీసులను ఆశ్రయించారని, సమాజంలో రోజురోజుకూ అరాచకాలు పెరిగిపోతున్నాయని వాపోయారు. ఎంత కఠినంగా శిక్షించి నప్పటికీ, కీచకుల ఆగడాలకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధితులకు అండగా నిలబడేందుకు అనుమతినివ్వాలని చీఫ్ ఎలక్షన్ కమిషన్‌ను ఆమె కోరారు.

బీఎల్వోల గౌరవ వేతనం విడుదలకు చర్యలు

అదనపు ఎన్నికల అధికారికి వీఆర్వోల సంఘం వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పని చేస్తున్న బీఎల్వోలకు మూడేళ్లుగా నిలిచిపోయిన గౌరవ వేతనం విడుదలకు చర్యలు తీసుకో వాలని రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి పి. కోటేశ్వరరావుకు ఏపీ వీఆర్వోల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలోని ఎన్నికల అధికారిని గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీ నారాయణ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఒక్కో బీఎల్వోకు సుమారు రూ.18 వేలు రావాల్సి ఉందన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఒక్కో పోలింగ్ కేంద్రానికి సుమారు రూ.10 వేలు ఖర్చుపెడితే, ఒక్కో బీఎల్వోకు వేర్వేరు ప్రాంతాల్లో రూ.రెండు వేల నుంచి రూ.ఎనిమిది వేల వరకు రకరకాలుగా ఇచ్చారని తెలిపారు. దానివల్ల వీఆర్వోలు, బీఎల్వోలు ఎంతో ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. ఒక్కొక్కరికి రూ.10వేలు ఇచ్చేందుకు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. స్పందించిన అదనపు ఎన్నికల అధికారి... బీఎల్వోలకు సంబంధించి గౌరవ వేతనం ఫైల్ ఫైనాన్స్‌లో ఉందని, త్వరలోనే నిధులు విడుదల చేస్తామని తమకు హామీ ఇచ్చారని చెప్పారు.

గ్రేడ్-2 వీఆర్వోల ప్రొబిషన్ ప్రకటించాలి

గ్రేడ్-2 వీఆర్వోల ప్రొబిషన్‌కు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చి దాదాపు మూడు నెలలు అవుతున్నప్పటికీ, జిల్లా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు అన్నారు. వెంటనే వారందరికీ ప్రొబిషన్ డిక్లేర్ చేయాలని భూ పరిపాలన అధికారులను కలసి విజ్ఞప్తి చేశారు. జీవో 111, జీవో 417 ప్రకారం కారుణ్య నియామకం ద్వారా భర్తీ అయిన వారికి సర్వే ట్రైనింగ్, సర్వే ఎగ్జామ్స్ నిర్వహించనందున, వీరికి కూడా వెంటనే ప్రొబిషన్ డిక్లేర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక మంత్రి వివరణ ఇవ్వాలి

కేంద్రానికి ఆర్బీఐ సాయంపై ఓబులేసు డిమాండ్

విజయవాడ: కేంద్ర ప్రభుత్వానికి భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) రూ.2,10,874 కోట్ల ఇతోధిక సాయం ప్రకటించడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు ఖండించారు. ఈ నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలహీనం చేసేదిగా ఉన్నట్లు గురువారం ఒక ప్రకటన చేశారు. బిమల్ జలాన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్రానికి ఎన్నడూ లేని విధంగా ఇంత భారీ మొత్తాన్ని ముఖ్యంగా ఎన్నికల వేళ సమరకూర్చడం ఆక్షేపణీయమని పేర్కొన్నారు. ఆర్బీఐ నుంచి మిగులు నిధులను కేంద్రం తీసుకోవడం వల్ల భవిష్యత్‌లో వచ్చే ఆర్థిక మందగమన పరిస్థితులను ఎదుర్కొనే రిజర్వు బ్యాంకు సామర్థ్యాన్ని తగ్గిస్తుందన్నారు. ఈ ప్రక్రియలో పారదర్శకత లోపించడంతో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఓబులేసు పేర్కొన్నారు. తాజా పరిణామంపై కేంద్ర ఆర్థిక మంత్రి సమగ్ర వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

27న సబ్సిడీ విత్తనాల కోసం వినతులు

ఏపీ రైతుసంఘం నేతలు ఈశ్వరయ్య కేవీవీ ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో తక్షణమే రైతాంగానికి 90శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో తహశీల్దారులకు వినతిపత్రాలను ఈనెల 27వ తేదీ సమర్పించాలని పిలుపునిచ్చారు. మరో వారం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నప్పటికీ రైతాంగానికి అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలతోపాటు, మినుము, పెసర, నువ్వులు, వేరుశనగ, వరి, కంది తదితర పంటల విత్తనాలు సరఫరాకు తగిన చర్యలు తీసుకోలేదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరం తీవ్రమైన కరువుతోపాటు మిచింగ్ తుపాను వల్ల రైతులు నష్టపోవడాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే నామమాత్రపు సబ్సిడీ కాకుండా సబ్సిడీని 90శాతానికి పెంచాలని డిమాండు చేశారు. గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంట నష్టపోయిన రైతాంగానికి పూర్తిస్థాయిలో పంటల భీమా సొమ్ము రైతాంగానికి తక్షణం అందించాలని కోరారు. పంట రుణాలను బ్యాంకులు సక్రమంగా ఇచ్చే పరిస్థితిలేదన్నారు. రాబోయే కాలంలో పంట రుణాల శాతాన్ని తగ్గించి కేవలం బంగారు రుణాలు ఇవ్వాలనే ఆలోచనలో బ్యాంకులు ఉన్నట్లు తెలుస్తున్నదని పేర్కొన్నారు. పెరుగుతున్న వ్యవసాయ ఖర్చుల దృష్ట్యా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రైతులు, కౌలు రైతులందరికి రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల గత సంవత్సరం సుమారు 30 లక్షల ఎకరాల్లో పంటల సాగు కాలేదని గుర్తుచేశారు. పంటల సాగు, ఉత్పత్తి తగ్గితే ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు చేపట్టేముందే మట్టి నమూనాలు సేకరించి ఏ పంటలు వేయాలో వ్యవసాయ సిబ్బంది ద్వారా రైతాంగానికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం తక్షణం స్పందించి రైతాంగాన్ని ఆదుకునేలా 90శాతం సబ్సిడీతో అన్ని రకాల విత్తనాలు అందించాలని, రైతులు, కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు 27న వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు.

ఆశలు ఆవిరి

- సీపీఎఫ్ ఫ్యాక్టరీ మూసివేత
- ఆందోళనలో ఉద్యోగులు
- న్యాయం చేయాలని అధికారులకు వినతి

విశాలాంధ్ర-గణపవరం: కోటి ఆశలతో కొలువులో చేరిన ఉద్యోగులకు పెద్దకష్టమొచ్చిపడింది. పదకొండేళ్లు సేవలందించిన ఉద్యోగులకు కనీసం ముందస్తు నోటీసు ఇవ్వకుండా యాజమాన్యం ఫ్యాక్టరీకి తాళాలు వేయడంతో కుటుంబాలతో సహా నడిరోడ్డున పడ్డ హృదయవిదారక సంఘటన ఇది. ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి... ఆనక వంచించి వదిలేయడంతో తమ జీవితాలకు భరోసా లేకుండా పోయిందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. భారీ లాభాలు గడించినా... నష్టాలను సాకుగా చూపి గేటుకు తాళాలు వేయడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దేశంలో సీపీఎఫ్ గ్రూప్ కంపెనీలన్నీ లాభాల్లో నడుస్తుండగా ఒక్క గణపవరం ఫ్యాక్టరీని మూసివేయడంలో ఆంతర్యం అంతుబట్టడం లేదు. వివరాల్లోకి వెళితే... పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం (సరిపల్లె) గ్రామంలో 11 ఏళ్ల క్రితం థాయ్‌లాండ్ దేశానికి చెందిన ఓ కంపెనీ సీపీఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున... చేపలు, రొయ్యల మేతల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసింది. భారీ లాభాలు గడించింది. కానీ, కంపెనీ నష్టాల్లో ఉందని సాకు చూపి యాజమాన్యం మూసివేసింది. దేశంలో సీపీఎఫ్ గ్రూప్ ఫ్యాక్టరీలన్నీ లాభాల్లో నడుస్తుండగా... గణపవరం ఫ్యాక్టరీని మాత్రమే మూసివేయటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి... ఉద్యోగాల్లోకి తీసుకుని... ఇన్నేళ్లుగా తమ సేవలు వినియోగించుకుని హామీ నెరవేరకుండానే యాజమాన్యం నట్టేట ముంచిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ గేటుకు తాళాలు వేయడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని లబోదిబో మంటున్నారు. కనీసం లోనికి రాకుండా చేయడంతో... జీతంపై ఆధారపడిన తమను ఆదుకునేదెవరని కన్నీటి పర్యంతమవుతున్నారు. ముందస్తు నోటీసు ఇవ్వకుండా తమను బయటకు పంపిన యాజమాన్యంపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అల్లర్లపై చర్యలకు ఈసీ వెనకడుగు

వైసీపీనేత అనిల్ కుమార్ యాదవ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ అల్లర్లపై చర్యలు తీసుకోలేదని, టీడీపీ నేతలు సత్యహరిశ్చంద్రులు అన్నట్లుగా వ్యవహరిస్తోందని వైసీపీ నేత పి.అనిల్ కుమార్ యాదవ్ విమర్శించారు. తాడేపల్లి నుంచి గురువారం ఆయన మీడియాకు వీడియో సందేశమొకటి విడుదల చేశారు. పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన హింస, అల్లర్లపై ఎన్నికల కమిషన్ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. మాచర్ల నియోజకవర్గంలో అధికారులను మార్చిన తర్వాతనే దాడులు, హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయని చెప్పారు. మాచర్లలో టీడీపీ అల్లర్లకు పాల్పడవచ్చని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముందు నుంచి ఈసీకి లేఖలు రాస్తూనే ఉన్నారన్నారు. అక్కడ జరిగిన అన్ని సంఘటనలపై ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలని కోరారు. చాలా ప్రాంతాలలో రిగ్గింగ్ జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు జరుగుతున్నాయని తాను ఎస్పీకి ఫోన్ చేస్తే ఏమాత్రం స్పందించలేదన్నారు. టీడీపీ రిగ్గింగ్ చేస్తున్న చోట ఎస్పీ సహకారం అందించాడని, ఎస్పీ స్పందించకపోతే పిన్నెల్లి వెళ్లి అడ్డుకున్నారని వివరించారు. పాల్వాయి గేట్ వద్ద పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కొడుకు తల పగలగొట్టినా పోలీసులు స్పందించలేదన్నారు. పోలింగ్ రోజున తొమ్మిది ఈవీఎంలు ధ్వంసమైతే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి చెందిన ఒక్క వీడియో మాత్రమే ఎందుకు బయటకు వచ్చిందని నిలదీశారు. మాచర్ల, మిగతా నియోజకవర్గాల పరిధిలో ఈవీఎంలు పగులగొట్టినచోట ఎందుకు చర్యలు తీసుకోలేదని, వీడియోలు బయటకు ఎందుకు ఇవ్వలేదన్నారు. తొమ్మిదిచోట్ల ఈవీఎంల ధ్వంసం జరిగితే కేవలం ఒకటి మాత్రమే వీడియో ఎలా బయటకు వచ్చిందని, మిగిలిన ఎనిమిది వీడియోలు బయటకు ఎందుకు రాలేదని మండిపడ్డారు. వైసీపీనే గొడవలకు కారణమనీ, టీడీపీ కాదని చెప్పాలనే ఈసీ ప్రయత్నంగా కనిపిస్తోందన్నారు. వీడియో ఎలా బయటకు వచ్చిందో ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలని, దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం విచారించాలని డిమాండ్ చేశారు. ఒక సామాజిక వర్గం అధికారులను అడ్డం పెట్టుకొని తెలుగుదేశం నేతలు రిగ్గింగ్ చేశారని ధ్వజమెత్తారు. మాచర్లలో రెండు రోజుల ముందు ఓ పథకం ప్రకారం పోలీసులను మార్చారని, టీడీపీ ఎంపీ అభ్యర్థి సామాజిక వర్గానికి చెందిన పోలీసులను నియమించుకున్నారని విమర్శించారు. పిన్నెల్లి ఘన విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. ఈ సంఘటనలపై తాము న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు.

బస్సు బోల్తా-ఇద్దరు చిన్నారుల దుర్మరణం

12 మందికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-కోడుమూరు: కోడుమూరు- కర్నూలు ప్రధాన రహదారిలోని ప్యాలకుర్తి సమీపంలో గురువారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు దుర్మరణం చెందగా 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి. హైదరాబాద్ నుంచి ఆదోనికి బిస్మిల్లా ప్రైవేట్ ట్రావెల్స్ స్లీపర్ కోచ్ బస్సు బుధవారం రాత్రి బయలుదేరింది. అతి వేగంగా వస్తూ కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ప్యాలకుర్తి సమీపంలో ఓ మలుపు వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని దాటి వెళ్లబోయి అదుపుతప్పి బోల్తా పడింది. బస్సులో దాదాపు 29 మంది ప్రయాణిస్తున్నారు. చీకట్లో ఏం జరిగిందో తెలుసుకునే లోపే ఘోరం జరిగిపోయింది. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు కింద లక్ష్మి (13), గోవర్ధని (8) అనే ఇద్దరు చిన్నారులు విగత జీవులుగా పడి ఉన్నారు. వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొంతమంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతి చెందిన చిన్నారులను మైదుకూరు చెందిన వెంకటేష్ కుమార్తె లక్ష్మి, సురేష్ కుమార్తె గోవర్ధనిగా నిర్ధారించారు. హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన టీ భారతి, నందవరం మండలం ముగితి గ్రామానికి చెందిన గౌస్ మొహిద్దీన్, కోసిగి గ్రామానికి చెందిన బదినిహాల్ మౌనిక, ముదగల్లు పుష్పావతి, ఆదోని, అమలాపురం గ్రామానికి చెందిన పినిశెట్టి లక్ష్మి, ఎమ్మిగనూరుకు చెందిన సాయిగణేష్, కొమ్ముపాలెం అశోక్ కుమార్, కృష్ణవేణి, కోడుమూరుకు చెందిన ఆమడగుంట్ల అశోక్, ఎమ్మిగనూరు బాపురంనకు చెందిన అన్నం వెంకటరెడ్డి, ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన రవికుమార్, ఆదోని పట్టణానికి చెందిన రాజు గాయపడ్డారు. వీరు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రమాద తీరుపై ఎస్పీ ఆరా

ఇదిలా ఉండగా , జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, సీఐ మన్సురుద్దీన్‌తో కలిసి ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. కోడుమూరు ఎస్ఐ బాలనరసింహులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గూడూరు ఎస్ఐ హనుమంతు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రుల వివరాలు సేకరించారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ పరారయ్యాడు.

నాగార్జునకొండ కట్టడాలు... బౌద్ధ భిక్షువుల సందర్శన

శ్రీపర్వత, విజయపురి చరిత్రను వివరించిన శివనాగిరెడ్డి

విశాలాంధ్ర-విజయపురి సౌత్ (మాచర్ల): బుద్ధ జయంతిని పురస్కరించుకుని నాగార్జునకొండ కట్టడాలను గురువారం టిబెట్ బౌద్ధ భిక్షువులు సందర్శించారని బుద్ధవనం కన్సల్టెంట్, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన బుద్ధవనం వద్ద 2568వ బుద్ధ జయంతిని నిర్వ హించారు. ప్రత్యేక అతిథులుగా విచ్చేసిన బౌద్ధ భిక్షువులు అనుపు వద్ద (విజయపురి సౌత్) గల బౌద్ధ కట్టడాలను దర్శించారన్నారు. మహాయాన సాంప్రదాయ ప్రకారం బుద్ధునికి, ఆచార్య నాగార్జునకి అనుపు బౌద్ధారామం వద్ద బౌద్ధ భిక్షువులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైసూరు సమీపంలోని బైలుకుప్పే సెరా టిబెటన్ బౌద్ధారామానికి చెందిన గేషే నవాంగ్ జుంగ్నె మరియూ జంపాకుంగ అనే బౌద్ధ భిక్షులకు, నాగార్జునకొండలో తిరుగాడిన ఆచార్య నాగార్జునుడు, శ్రీపర్వత విజయపురిలో విలసిల్లిన ఇక్ష్వాకుల కాలం (క్రీస్తుశకం మూడో శతాబ్దం) నాటి బౌద్ధ చరిత్ర, కట్టడాలు, శిల్పాలు, శాసనాలు, స్తూపాలు, చైత్యాలు, విహారాల గురించి శివనాగిరెడ్డి వారికి వివరించారు. బుద్ధ జయంతి రోజున నాగార్జునకొండ బౌద్ధ క్షేత్రాన్ని సందర్శిం చడం తమకు ఎంతో సంతోషాన్నిచ్చిందని, మహాయాన సిద్ధాంతకర్త, మాధ్యమిక, శూన్య వాదాలను స్థిరీకరించిన ఆచార్య నాగార్జునుడు తమకు అత్యంత గౌరవ నీయుడని బౌద్ధ భిక్షువులు తనకు చెప్పారని శివనాగిరెడ్డి వివరించారు. వెంకటేశ్వర్లు, స్థానిక బౌద్ధాభిమానులు గ్రంధి రామకృష్ణ, నాగార్జున పాల్గొన్నారు. బౌద్ధ కట్టడాలను శ్రద్ధతో పరిరక్షి స్తున్న కమలహాసన్‌ను వారు అభినందించారు.

ఓట్ల బదిలీపై గుబులు

బీజేపీకి టీడీపీ, జనసేన సహకరించాయా?

గెలుపుపై కమనాథుల మౌనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల లెక్కింపు తేదీలు దగ్గర పడటంతో ఎన్డీఏ కూటమిలోని బీజేపీ అభ్యర్థులకు ఆందోళన మొదలైంది. ఆ పార్టీ నేతలు గెలుపుపై మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ...గెలుపుపై ఆశలు కనిపించడం లేదు. దొడ్డిదారిన ఆంధ్రప్రదేశ్‌లో బలపడదామనుకున్న బీజేపీ ఆశలు ఎంతవరకు నెరవేరతాయనేది జూన్ 4న తేలనుంది. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేయగా... జనసేన మద్దతిచ్చింది. నాడు బీజేపీకి నాలుగు అసెంబ్లీ సీట్లు దక్కాయి. 2024 ఎన్నికల్లో అవే పొత్తులు పునరావృతమయ్యాయి. ఈసారి టీడీపీ, బీజేపీతో పాటు జనసేన కూడా ఎన్నికల బరిలో నిలిచింది. పొత్తుల్లో భాగంగా బీజేపీ ఆరు లోక్‌సభ, 10 అసెంబ్లీ సీట్లలో పోటీ చేసింది. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన నుంచి బీజేపీకి ఓట్లు బదిలీ కాలేదని ప్రచారం జరుగుతోంది. దేశవ్యాప్తంగా మోదీ ప్రభుత్వంపై వ్యతిరేకత, ఇండియా కూటమి బలపడటం బీజేపీకి ఇబ్బందికరంగా మారింది. రాష్ట్రంలోని ముస్లిం, క్రైస్తవ మైనార్టీలు బీజేపీకి పూర్తి వ్యతిరేకం. 2019లో బీజేపీకి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. అలాంటి బీజేపీ కేంద్రంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని...రాష్ట్రంలో టీడీపీ, జనసేనతో పొత్తుకు దిగింది. ఆరు పార్లమెంట్ స్థానాలు, పది అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేశారు. అరకు, అనకాపల్లి, రాజమండ్రి, నరసాపురం, తిరుపతి, రాజంపేట లోక్‌సభ స్థానాలను బీజేపీ ఎంచుకుంది. అరకు ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత, అనకాపల్లికి సీఎం రమేశ్, రాజమండ్రి నుంచి దగ్గుబాటి పురందేశ్వరి, నరసాపురం నుంచి శ్రీనివాస్ వర్మ, తిరుపతి-వరప్రసాద్, రాజంపేటకు మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి పోటీ చేశారు. కేంద్రంలో మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే ఏపీ కోటాలో కేంద్రమంత్రి పదవులు పొందవచ్చని ఆశిస్తున్నారు. అంతేకాకుండా టీడీపీ, జనసేన పొత్తుతో లెక్కలేకుండా గెలవవచ్చని ముందు భావించారు. కానీ ఎన్నికల తర్వాత బీజేపీ ఆశలపై నీళ్లు చల్లినట్లు వార్తలు వస్తున్నాయి. టీడీపీ, జనసేన ఓట్లు బీజేపీకి బదిలీ కాకపోవడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. బీజేపీ పోటీ చేసిన పది అసెంబ్లీ స్థానాల్లోనూ కూటమిలో కుంపట్లు చెలరేగాయి. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ, జనసేన నేతలు సహకరించలేదని వార్తలు వస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల, విశాఖజిల్లా విశాఖపట్నం నార్త్, అల్లూరిసీతారామరాజు జిల్లా అరకు, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి, ఏలూరు జిల్లా కైకలూరు, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ, కర్నూలు జిల్లా ఆదోని, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేల్, జమ్మలమడుగు అసెంబ్లీ స్థానాలలో బీజేపీ పోటీ చేసింది. 2014, 2019లో ఈ పది అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ గెలిచింది. ఉదాహరణకు అరకు, విజయవాడ పశ్చిమ, బద్వేల్, జమ్మలమడుగులో వైసీపీ అభ్యర్థులు వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. అరకు, రాజంపేట ఎంపీ స్థానాలను వైసీపీ రెండుసార్లు గెలుచుకుంది. ఈ సీట్లలో బీజేపీ గెలుపుపై ఆ పార్టీ నేతలు అయోమయంలో పడ్డారు.

సంపాదకీయం

ఎన్నికల కమిషన్ దొడ్డిదారి వ్యవహారం

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంలో ప్రధాన రాజకీయ పార్టీలు పోటీ పడుతుంటాయి. ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మతోద్రేకాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడంతోపాటు విపరీతంగా అసత్య ప్రచారం చేస్తున్నారు. ప్రధానమంత్రి మోదీ ఇలా ప్రవర్తించడంపై ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. అలాగే కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రవర్తనావళిని ఉల్లంఘించారనుకున్నప్పుడు బీజేపీ కూడా సహజంగానే ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తోంది. ఎన్నికల కమిషన్ ఈ విషయంలో విచిత్రంగా ప్రవర్తిస్తోంది. మోదీకి నేరుగా నోటీసు జారీ చేయడానికి ఎన్నికల కమిషన్ జంకుతోంది. అందుకే బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డాకు మీ పార్టీ నేతలు మతోన్మాదాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదని సలహా ఇవ్వండి అని హితవు పలికింది. అలాగే రాహుల్ గాంధీ తదితర కాంగ్రెస్ నాయకుల మీద ఫిర్యాదులు వచ్చినప్పుడూ నేరుగా ఆ వ్యక్తులకు నోటీసు ఇవ్వకుండా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గేకు ఓ సలహా పారేసింది. మోదీకి నోటీసు ఇవ్వడానికి జంకినందువల్లే రాహుల్ విషయంలో కూడా కాంగ్రెస్ అధ్యక్షుడికి నోటీసు ఇవ్వడంతో సరిపెట్టుకుంది. ఎన్నికల్లో ఒక్కో దశ ముగుస్తున్న కొద్దీ మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ప్రచార సభల్లో విపరీతమైన విష ప్రచారం కొనసాగిస్తున్నారు. సకల నియమాలనూ ఉల్లంఘించి మతోద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. యోగీ ఆదిత్యనాథ్ అయితే ఉత్తరప్రదేశ్‌లో రోడ్లమీద నమాజు చేసేవారు అదృశ్యమయ్యారని అన్నారు. ఆయన ముస్లింలను ఉద్దేశించే ఈ మాట అన్నారని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఏ నాయకుడైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని నిర్ధారించుకున్నప్పుడు ఎన్నికల కమిషన్ వారి మీద నామ మాత్రమైన చర్య అయినా తీసుకుంటుంది. వారిని ఒక రోజో లేదా రెండు రోజులో ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండమని నిర్దేశిస్తుంది. కానీ మోదీ, అమిత్ షా విషయంలో ఒక్కసారి కూడా ఇలాంటి చర్య తీసుకోలేదు. చివరకు బుధవారం ప్రధాన ఎన్నికల ప్రచారకులు "మతపరమైన" ప్రసంగాలు చేయకూడదని అలాంటి ప్రసంగాలు చేసిన వారికి కాకుండా బీజేపీకి సందేశం పంపింది. సమాజాన్ని విభజించే ప్రకటనలు చేయకూడదని కూడా తెలియజేసింది. అదే రీతిలో కాంగ్రెస్ కు పంపిన సందేశం మరీ విచిత్రంగా ఉంది. "రాజ్యాంగాన్ని రద్దు చేయవచ్చు" లాంటి తప్పుడు అభిప్రాయాలు కలగ చేయకూడదని కోరింది. కాంగ్రెస్ నాయకులు, లేదా ఇతర ప్రతిపక్ష నాయకులు మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని భయాందోళనలు వ్యక్తం చేయడం నిరాధారంగా చేస్తున్న ఆరోపణకాదు. బీజేపీ సీనియర్ నాయకుడు హెగ్డేతో పాటు అనేక మంది బీజేపీ నాయకులు ఎన్.డి.ఎ. కూటమికి 400 కన్నా ఎక్కువ స్థానాలు ఇచ్చి గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని పదే పదే చెప్తూనే ఉన్నారు. ఈ మాటలను మోదీ ఖండించినప్పటికీ అది ఉదాహరణ ప్రాయమైంది మాత్రమే. అమితమైన మెజారిటీ దక్కితే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చడంతో పాటు చేయదలచుకున్న పనులేమిటో మోదీకి కచ్చితమైన అభిప్రాయం ఉంది. తాము రిజర్వేషన్లకు వ్యతిరేకులం కాదు కానీ మతపరమైన రిజర్వేషన్లను అంగీకరించబోమని మోదీనే అంటున్నారు. నిజానికి ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్లు మత ప్రాతిపదికన కల్పించిన రిజర్వేషన్లు కావు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగం నిర్దేశించింది. ఈ ప్రాతిపదికన దళితులకు, గిరిజనులకు రిజర్వేషన్లు దక్కాయి. ఇస్లాం మతానుయాయులైనప్పటికీ వారిలోని కొన్ని వర్గాలకు సైతం రిజర్వేషన్లు మొదటి నుంచీ అమలు అవుతున్నాయి. కానీ ఈ సదుపాయం కల్పించిన సందర్భంలోనే రాజ్యాంగ రచనా కమిటీకి అధ్యక్షుడైన డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ఇతర వెనుకబడిన వర్గాల వారూ ఉన్నారని చెప్పడంతో మొట్ట మొదట ఈ విషయం తేల్చడానికి కాకా కాలేల్కర్ కమిషన్ ఏర్పాటు అయింది. అయితే ఆయన నివేదిక సమర్పించిన సమయంలోనే ఈ నివేదికను తాను నమ్మడం లేదు అని చెప్పడంతో ఇతర వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించే బాధ్యత రాష్ట్రాలకు వదిలేశారు. కేంద్ర స్థాయిలో మండల్ కమిషన్ ఏర్పాటు, ఆ కమిషన్ సిఫార్సులు ఏళ్ల తరబడి అటక మీదే ఉండిపోవడం లాంటి అంశాలు చరిత్రలో భాగం. వివిధ రాష్ట్రాలు క్రమంగా ఇతర వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించాయి. చివరకు మండల్ కమిషన్ నివేదిక విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు అమలైంది. ఈ వ్యవహారం మోదీకి, బీజేపీ నాయకులకు తెలియక కాదు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ రిజర్వేషన్లు లాగేసి ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తారని దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ అంశాన్ని ఎన్నికల కమిషన్ పట్టించుకున్న పాపాన పోలేదు.

బీజేపీ అధ్యక్షుడు నడ్డాకు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గేకు జారీ చేసిన నోటీసులో తమ ప్రధాన ప్రచారకులు మర్యాద ఉల్లంఘించకుండా చూసుకోవాలని ఎన్నికల కమిషన్ కోరింది. మోదీ, తదితర బీజేపీ నాయకులు ఎంత మత విద్వేషం రెచ్చగొట్టినా ఎన్నికల కమిషన్ కంటికి కనిపించదు. చెవికి వినిపించదు. నోటికి తాళం వేసుకు కూర్చుంటుంది. ఎన్నికల సమయంలో దేశ సామాజిక, సాంస్కృతిక వాతావరణానికి భంగం కలిగించకూడదని ఎన్నికల కమిషన్ చెప్పడం సరైందే కావచ్చు. కానీ ఈ మాట ఎవరికి చెప్పాలో వారికి చెప్పకుండా ధర్మపన్నాలు వల్లించడం ఎన్నికల కమిషన్ నిష్క్రియా పరత్వానికి నిదర్శనం. ఏ పక్షం నాయకులు సామాజిక, సాంస్కృతిక వాతావరణానికి భంగం కలిగిస్తున్నారో తేల్చే ఉద్దేశం ఎన్నికల కమిషన్‌కు లేదు. గుండు గుత్తగా ఉభయ పక్షాలకు నోటీసులు జారీచేసి తాము నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నట్టు నమ్మించడానికి తంటాలు పడుతోంది. ఎన్నికల కమిషన్ నడ్డాకు నోటీసు జారీచేసిన తరవాత ఆయన తన పార్టీ నాయకులను కట్టడిచేసిన దాఖలాలే లేవు. మోదీని నియంత్రించే సత్తా ఆయనకు ఎలాగూ లేదు. ఎన్నికల ప్రచారంలో సైన్యాన్ని లాగకూడదని కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో ఉంది. ఎన్నికల కమిషన్ దృష్టిలో ప్రతిపక్షాలు అగ్నిపథ్ పథకాన్ని తప్పుపట్టడం కాంగ్రెస్ ప్రస్తావించడం ఉల్లంఘన కింద కనిపించింది. అగ్నివీరులను నియమించే పథకం ఉపాధికి సంబంధించిన అంశం. ఈ పథకం కింద సైన్యంలో చేరిన వారిని నాలుగేళ్ల తరవాత ఇంటికి పంపించేస్తారు. ఆ తరవాత వారికి సైనికులకు దక్కే సదుపాయాలు ఏమీ ఉండవు. ఇదీ ప్రతిపక్షాల అభ్యంతరం. నిరుద్యోగులకు ఎదురవుతున్న సమస్య. ఇది ఎన్నికల కమిషన్‌కు ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించడంగా కనిపించడం వారి అమాయకత్వం కాదు. మోదీ ఆజ్ఞకు బద్ధులై, మొత్తం ఎన్నికల క్రమాన్ని బీజేపీకి అనుకూలంగా మలచడంలో భాగం. ఆ కమిషన్ అధినేతలకు నాణానికి ఉన్న బొరుసే కనిపిస్తుంది తప్ప బొమ్మ కనిపించదు.

వర్గ రహిత సమాజం

వివేచన

- బండారు రాధాకృష్ణ

రా బావ ఏంటి తిట్టుకుంటూ వస్తున్నావు ఎవర్ని ఎందుకు. ఎందుకంటావేమిటి గత ఐదేళ్లలో పెరగనిది ఒకటి చెప్పు. ఇంటిపన్ను, నీటిపన్ను, చెత్త పన్నులతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు అసలు ఒకటేమిటి అన్నీ పెరిగాయి. మధ్యతరగతి వాళ్లం మనం ఎలా బతకాలో చెప్పు. నిజమే పన్నులు పెంచకుండా ప్రజల అవసరాలు ఎలా తీర్చాలి. గతంలో ఒక సామెత ఉంది. తాగినోడె కడతాడు తాళ్ల పన్ను అని. అది నిజమే కాని ఇప్పుడు అందుకు వ్యతిరేకంగా ఉంది. పెంచిన పన్నులు కట్టేది మనం, తినేది తెల్లకార్డు పేదలు, అది సరేనయ్యా ఉన్న వాడి దగ్గర వసూలు చేయకుండా లేని వాడికి పెట్టడానికి డబ్బులు చెట్లకు కాయవుకదా. నాకిపుడు మహాకవి శ్రీశ్రీ అన్న మాటలు గుర్తుకు వస్తున్నాయి. గతంలో విరసం అధ్యక్షుడుగా ఉన్నప్పుడు తెనాలి సభలో ఒక మాటన్నాడు. మెరక తవ్వకుండ పల్లం పూడదు. కోడిగుడ్డు పగల కొట్టకుండా ఆమ్లెట్ వెయ్యలేమని. ఇప్పుడు జరిగేది అంతే. ఉన్నవాడి వద్ద వసూలు చేయకుండా లేనివాడికి పెట్టలేముకద ఆ పనే జరిగింది గత ఐదేళ్లు. సమాజం సర్వజనులది. అందరూ సుఖంగా జీవించాలంటే అందరి సమస్యలు పరిష్కరించవలసిందె. అందువల్ల పన్నులు పెంచక తప్పదు బావ. గతంలో ఇద్దరో, ముగ్గురో ఉన్న బిలియనీర్లు ఇప్పుడు 200 దాటారు. మరి దేశ సంపద వందల మంది వద్ద ఉండి పోతే పేదలకు చెయ్యడానికి డబ్బు ఎక్కడినుండి వస్తుంది. బీజేపీ పుణ్యమా అని కుబేరులు దేశంలో పెరిగిపోతున్నారు. నిజమే గతంలో రాజకీయాల్లోకి సమాజసేవ కోసం వచ్చేవారు. ఇప్పుడు సంపాదనకోసం వస్తున్నారు. శారీరకంగా, మానసికంగా సమాజంకోసం పని చేయడమేగాక స్వంత ఆస్తులను పార్టీకి ఇచ్చిన నిస్వార్థ నాయకులను గతంలో చూశాం. పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, మానికొండ సుబ్బారావు లాంటి నాయకులు తమ స్వంత ఆస్తులను పార్టీకి ఇచ్చారు. ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం పార్టీలు స్థాపించి వాటి మనుగడకోసం ఆస్తులు అర్పించిన నాయకులు వారు. కాని పార్టీల ద్వారా పదవి చేపట్టి పదవి ద్వారా సంపాదనే ముఖ్యంగా ప్రస్తుత రాజకీయాలు నడుస్తున్నాయి. అధి కారంలో ఉన్న పార్టీ చేస్తున్న తప్పులు ఎత్తిచూపి ఏం చేయాలో, ఎలా చేస్తే ప్రజలకు ఉపయోగమో చెప్ప వలసిన బాధ్యత ప్రతిపక్షాలది. కాని ప్రస్తుతం అధికారంలో ఉన్న వారేమిచేసినా తప్పుగా భావించి అల్లరి చేయడమే ప్రతిపక్షాల బాధ్యతగా మారింది. ప్రస్తుతం భూముల రీ సర్వే విషయంలో అదే జరుగుతోంది. అది తెచ్చింది కేంద్రం అయితే, బీజేపీని ఏమీ అనకుండా రాష్ట్ర ప్రభుత్వాల దుశ్చర్యగా మాట్లాడటం గమనార్హం. పేదలకు పెడితే ఉన్నవాడికి కోపం ఉన్న వాడికి లబ్ది చేకూరితే లేనివాడికి కోపం ఉన్నవాడు లేనివాడుగా వర్గాలు విభజించిన సమాజంలో ఇది తప్పదు. ఇది సరే శ్రామికులు లేకుండా అభివృద్ధి జరగదు కదా అని. ప్రాజెక్టులు కట్టాలన్నా, రోడ్ల నిర్మాణం చేయాలన్నా, కాల్వలు తవ్వాలన్నా శ్రామిక వర్గం అవసరంకదా. మరి వారి కడుపు నిండకుండా పనిచేయలేరు కదా. నిజమే అందుకే శ్రీశ్రీ అంటాడు తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లు ఎత్తిన కూలీలెవ్వరు. ఒక్క షాజహాన్ నిర్మించలేదు కదా. అందుకే ప్రస్తుతం పేదలు, లోయరు, మిడిల్ క్లాసు, అప్పరు మిడిల్‌క్లాసు ధనవంతులుగా నాలుగు వర్గాలుగా సమాజం నిండి ఉంది. ఈ స్థితిలో శ్రామిక వర్గం పనిచేయనిదే అభివృద్ధి జరగదని తెలిసికూడా ఉన్న వారి వద్ద పన్నులు రూపంలో వసూలు చేసి పేదలకు పంచుతున్నా రనడం ఎంత వరకు సబబు. కాకపోతే పేదలకు ఉచితంగా పంచకుండా ఉపాధి కల్పించి తద్వారా వారి మనుగడకు ఇబ్బంది లేకుండా చూడడం మంచిది. అందుకు ప్రాజెక్టుల నిర్మాణం అవసరం. అందుకు ఆర్థిక వనరులు అవసరం ఇవన్నీ ప్రభుత్వాలకు సవాలు లాంటిదే మరి. వర్గరహిత సమాజం ఏర్పడేంత వరకు ఇంతే మరి.

సెల్: 98855 69394

మెజారిటీని కోల్పోనున్న బీజేపీ

నిత్య చక్రవర్తి

2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మొదటి ఐదు దశల పోలింగ్ ముగిసింది. మొత్తం 543 సీట్లలో కేవలం 115 సీట్లు మాత్రమే తదుపరి రెండు దశల్లో ఓటింగ్‌కు మిగిలి ఉన్నాయి. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. గత కొద్దిరోజులుగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ అగ్రనేతలందరూ బహిరంగ సభలు, టీవీ ఛానళ్లు, వార్తాపత్రికల్లో వరుస ఇంటర్వ్యూలలో బీజేపీ ఇప్పటికే మ్యాజిక్ ఫిగర్ 272, మెజారిటీ మార్క్ దాటేసిందని, తదుపరి రెండు దశల్లో 300 ప్లస్‌ను దాటుతుంది ప్రకటిస్తున్నారు. మొదటి ఐదు దశల్లో బీజేపీకి 310కి మించిన సంఖ్యను కూడా హోం మంత్రి అమిత్ షా ప్రస్తావించారు. ఇండియా కూటమికి సంబంధించి, మొదటి ఐదు దశల పోలింగ్ పోకడలు ఎన్‌డీఏకి వ్యతిరేకంగా జరుగుతున్నాయని, ఎన్‌డీఏ మెజారిటీని కోల్పోతుందనే భావనను కలిగించింది. అయితే రాహుల్‌గాంధీ మాత్రం జూన్ 4 తర్వాత కేంద్రంలో ఇండియా కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఎన్నికల ప్రచారసభల్లో ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోవడానికి జూన్ 4 తర్వాత ఇండియా కూటమి పార్టీల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ జూన్ 3న తన తండ్రి ఎంకె కరుణానిధి జయంతి కార్యక్రమానికి హాజరయ్యేందుకు, డిఎంకె కార్యాలయంలోతదుపరి పరిస్థితిని చర్చించడానికి ఢిల్లీలోని అన్ని ఇండియా కూటమి నాయకులను ఆహ్వానించారు. అయితే 2024 ఎన్నికల్లో బీజేపీ 200 లోక్‌సభ స్థానాలు దాటదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ప్రచారంలో పేర్కొంటున్నారు. జూన్ 4న అసలు ఏం జరగనుంది? సుప్రసిద్ధ అమెరికా రాజకీయ శాస్త్రవేత్త, రిస్క్ కన్సల్టెంట్ ఇయాన్ బ్రెమర్ ఎన్‌డిటివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో బీజేపీకి 295 నుండి 315 సీట్ల మధ్య వస్తాయని, అంటే బీజేపీ సొంతంగా మెజారిటీ సాధిస్తుందని చెప్పారు. భారతదేశంలో పనిచేస్తున్న గ్లోబల్ కంపెనీలు, బ్యాంకులు చేపట్టిన సర్వేలో బీజేపీకి చాలా అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. ఐదవ దశ తర్వాత, నివేదికలు అనిశ్చితి పరిస్థితిని వ్యక్తంచేశాయి. అగ్రశ్రేణి అమెరికా సంస్థ లోక్‌సభకు హంగ్ వచ్చే అవకాశం ఉందని సూచించిందని,

భారతదేశం గురించి తెలిసిన అగ్రశ్రేణి పెట్టుబడి విశ్లేషకులలో, ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో భాగంగా గత కొన్ని నెలలుగా దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఉత్తరప్రదేశ్‌లో కూడా విస్తృతంగా పర్యటించిన రుచిర్ శర్మ పరిశీలనల ప్రకారం, మొదటిది, నరేంద్ర మోదీకిగానీ, ప్రతిపక్షానికి అనుకూలంగా ఓటింగ్ లేదని పేర్కొన్నారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికలు రెండూ పెద్ద సంఖ్యలో మోదీ ఒరవడి సృష్టించాయి కానీ ఈసారి ఇండియా కూటమికి ప్రధాన సానుకూలంగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రెండవది, ప్రధానంగా దక్షిణ, తూర్పు రాష్ట్రాలలో స్థానిక, ప్రాంతీయ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో రామమందిరంతో సహా భక్తి ఉద్యమంతోపాటు భావోద్వేగ సమస్యలు ఓటర్లలో ఉన్నాయి. అయితే ప్రజలు నిరుద్యోగం, పేదరికం, ఆరోగ్య సౌకర్యాలు, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు వంటి ఇతర ప్రత్యక్ష సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ముస్లింలను రాక్షసత్వంగా చూపడం, కాంగ్రెస్‌ను హిందూ వ్యతిరేక పార్టీగా అభివర్ణించడం లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చేసిన ప్రసంగాలు, మిగిలిన 115 స్థానాల్లో హిందువుల ఓట్లు గణనీయంగా తగ్గే అవకాశం ఎక్కువగా ఉంది. మూడో పాయింట్ ..ఇండియా కూటమిలో భాగంగా బీజేపీని వ్యతిరేకిస్తున్న ప్రాంతీయ పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో మొదటి ఐదు దశల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తాయి. ఇండియా కూటమి తరఫున బీజేపీతో పోరాడుతున్న నియోజకవర్గాలలో బీజేపీపై వ్యతిరేకతను ఉపయోగించుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందని చెప్పవచ్చు. తగినంత ఆర్థిక వనరులు లేకపోవడం, బీజేపీ ఆర్థిక, సంస్థాగత బలానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తన బలాన్ని నిరూపించుకోలేకపోవడం మరో ప్రధాన సమస్య. 1996, 2004 ఎన్నికల తర్వాత లోక్‌సభ ఎన్నికల వ్యవహారం చూస్తే, 1996లో బీజేపీకి 161 సీట్లు, కాంగ్రెస్‌కు 140 సీట్లు వచ్చాయి. వాజ్‌పేయి నేతృత్వంలోని బీజేపీ 13 రోజుల తర్వాత కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జనతాదళ్ నేతృత్వంలోని ప్రతిపక్షం అప్పుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది, కానీ అది కూడా 1998లో పడిపోయింది. 2004 ఎన్నికలలో, కాంగ్రెస్‌కు 145, బీజేపీకి 138 వచ్చాయి. యూపీఏ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు పర్యాయాలు డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా కొనసాగారు.

అయితే 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల దృశ్యం కాస్త భిన్నంగా ఉంటుంది. 2004 లేదా 1996 ఎన్నికల అనంతర వ్యవహారం పునరావృతం కాదు. 2019 ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన 303 సీట్లలో ఎన్ని సీట్లు కోల్పోతుందనేది ఇక్కడ ప్రధాన చర్చ. 2019లో మోదీ వేవ్‌లో బీజేపీకి అత్యధిక సీట్లు లభించాయి. అయితే ప్రస్తుతం ఈ సంఖ్య ఖచ్చితంగా తగ్గుతుందనేది స్పష్టం. ఈ సంఖ్య తగ్గినప్పటికీ తదుపరి ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తుంది. అయితే ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కనీసం 80 సీట్లను కోల్పోవాల్సి ఉంటుంది.

2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత, బీజేపీకి 282 సీట్లు, ఎన్‌డీఏకి మొత్తం 336 సీట్లు అంటే ఇతర ఎన్డీయే పార్టీలకు కలిపి మొత్తం 54 సీట్లు వచ్చాయి. 2019 ఎన్నికల్లో బీజేపీకి 303 సీట్లు, ఎన్‌డీఏకు మొత్తం 353 సీట్లు వచ్చాయి అంటే బీజేపీయేతర ఎన్‌డీయే పార్టీలకు మొత్తం 50 సీట్లు వచ్చాయి. 2024 ఎన్నికలలో ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీలకు తగ్గి సంఖ్య 25 నుండి 30 సీట్ల మధ్య ఉండవచ్చు. బీజేపీకి 220 లేదా అంతకంటే తక్కువ వస్తే, ఎన్‌డీఏకి వచ్చే సీట్లసంఖ్య 245 నుండి 250 సీట్లు అవుతాయి. 272 సీట్లుకావాలంటే మరో 20సీట్లుతగ్గుతాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అతిపెద్ద కూటమి అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ ఏర్పాటుకు రాష్ట్రపతి ఆహ్వానించినా విశ్వాస పరీక్షను ఎదుర్కోవలసిఉంది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ, బీజేడీ వంటి ఇతర పార్టీల మద్దతు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమవుతుంది. ఈ రెండు పార్టీలకు ఎక్కువ కాకపోయినా మొత్తం 20 సీట్లు రావచ్చు. ఈ పార్టీల మద్దతు ఎన్‌డీఏ ప్రభుత్వం కొనసాగడానికి సహాయపడవచ్చు.

ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మధ్య కొనసాగుతున్న పోరు, ప్రభుత్వ ఏర్పాటుకు హంగ్ ఏర్పడితే, నవీన్ బీజేపీతో బంధాన్ని తెంచుకుని, ఇండియా కూటమికి మద్దతు ఇవ్వగలడని ఒక అంచనా. నవీన్‌తో ఇండియా కూటమి నాయకులు, ముఖ్యంగా స్టాలిన్, మమతా బెనర్జీ లాబీయింగ్ చేయవలసి ఉంటుంది. జగన్ మోహన్ రెడ్డి విషయానికొస్తే, తుది ఫలితాలను బేరీజు వేసిన తర్వాత ఆయన తన వ్యూహాన్ని నిర్ణయించే అవకాశం ఉంది.. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీకి అసలు ముప్పు ఏ పార్టీతో ఉంటుందో చూడాలి. ఖచ్చితంగా బీజేపీ–టీడీపీ కలయిక ఆయన రాజకీయ ఆధిపత్యానికి పెద్ద ముప్పుగా పరిణమిస్తుంది. జాతీయ రాజకీయాల్లో ఇప్పుడు ఎన్డీయేలో ఉన్న చంద్రబాబు నాయుడుతో జగన్ ఎప్పుడూ ఒకే శిబిరంలో ఉండలేరు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎన్డీయేకు మద్దతు ఇవ్వకపోవడానికి జగన్‌కు అనేక కారణాలున్నాయి.

కాబట్టి మొత్తం పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటే, 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత కూడా ఇండియా కూటమి అధికారంలోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీన్ని అమలుచేయాలంటే బీజేపీ సంఖ్యను 220 స్థాయికి తగ్గాలి. కాంగ్రెస్ పార్టీ పోటీలో ఉన్న నియోజకవర్గాలలో గెలుపుకు తన శాయశక్తులా కృషి చేయాలి. చివరగా, ఇండియా కూటమిలోని ప్రాంతీయ నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, నవీన్ పట్నాయక్‌తో సఖ్యతతో ఉంటే ఇండియా కూటమికి ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యేఅవకాశాలున్నాయి.

బ్రిటన్‌లో లేబర్‌పార్టీ ముందంజ

బెన్ చాకో

బ్రిటన్ పార్లమెంటుకు జరగనున్న ఎన్నికల్లో లేబర్ పార్టీ ముందంజలో ఉన్నదని తాజా సర్వే తెలియజేస్తోంది. అకస్మికంగా జనరల్ ఎన్నికలను ప్రధానమంత్రి రిషి సునాక్ బుధవారం ప్రకటించారు. టోరీల పాలనలో 14ఏళ్లపాటు ప్రజలు దారుణమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు. జులై 4వ తేదీన పోలింగ్ జరుగుతుంది. దీనికి ఒక వారం ముందు ప్రస్తుత పార్లమెంటు రద్దవుతుంది. లేబర్‌పార్టీ 20శాతం ముందంజలో ఉందని సర్వే వెల్లడించింది. దేశంలో ద్రవ్యోల్బణం 2.3శాతానికి పడిపోవడంతో ప్రధానమంత్రి ఆందోళనకు గురయ్యారు. తిరిగి ఎన్నికలు జరిగితే తనకు అనుకూలంగా ఉంటుందని ప్రధాని సునాక్ భావించారు. అధికారిక సర్వేప్రకారం ప్రభుత్వం తిరిగి గెలుపొందుతుందని అంచనాలున్నాయి. నాలుగేళ్ల క్రితం సెలవుల పథకాన్ని ప్రకటించి అమలు చేశారు. అలాగే ఆర్థిక సుస్థిరత సాధించామని ప్రకటించారు. 1997లో జరిగిన ఎన్నికల్లో లేబర్‌పార్టీ విజయం సాధించింది. లేబర్‌పార్టీ పాలనలో పరిస్థితులు మెరుగవుతాయని ఆశించారని అయితే మెరుగుపడలేదని సునాక్ అన్నారు. సునాక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచం నేడు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నదని చెప్పారు. తనకు స్టార్మర్ నాయకత్వంలోని లేబర్ పార్టీల మధ్య పోరు జరగనుందని అన్నారు. గతంలో టోరీల ప్రభుత్వం అక్టోబరు లేదా నవంబరు వరకు కొనసాగుతుందని భావించారు. అయితే ఇందుకు భిన్నంగా కామన్స్ పార్టీ రోజువారీ కార్యకలాపాలను పరిశీలించి ఎన్నికలను ప్రకటించారు. ఆకస్మికంగా ఎన్నికలు జరపాలని సునాక్ నిర్ణయం తీసుకోవడం వెనుక ఒక కారణం ఉంది. వలసవచ్చినవారిని రువాండాకు విమానాల ద్వారా తిరిగి పంపాలని భావించినప్పటికీ అది ఇంతవరకు సాధ్యంకాలేదు.

ఈ సారి తమకు భారీ మెజారిటీతో గెలుపు సాధ్యమవుతుందని లేబర్ పార్టీ సంతోషం వ్యక్తంచేస్తూ వివిధ కార్యక్రమాలను చేపట్టింది. భారీ మెజారిటీతో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధిస్తామని లేబర్‌పార్టీ ఆనందాన్ని వ్యక్తం చేస్తోంది. గత వారం లేబర్‌పార్టీ నాయకుడు సిర్‌కెయి విజయం సాధిస్తామని ప్రకటించారు. వామపక్ష

ఎంపీ జాన్ మెక్‌డొనాల్డ్ ఇలా చెప్పారు. "మార్పునకు ఇది సమయం. 14ఏళ్ల కన్సర్వేటివ్ ప్రభుత్వం సమాజాన్ని తీవ్రంగా దిగజార్చింది. మా పాఠశాలలను, కాలేజీలను, వాతావరణాన్ని, ఆర్థికస్థితిని దిగజార్చింది." టోరీ ఎంపీలలో అనేకమంది సునాక్ ఎన్నికల వ్యూహాన్ని సందేహిస్తున్నారు. ప్రధాని తీసుకున్న చర్యలు అప్రతిష్ట పాలయ్యాయని, పార్టీని ముందుకు నడిపిస్తున్న ప్రధాని పిచ్చెక్కినట్టుగా ప్రవర్తిస్తున్నారన్నారని టోరీ ఎంపీ ఒకరు పేర్కొన్నారు. లేబర్‌పార్టీ టోరీలకంటే 20శాతం ఆధిక్యతలో ఉన్నట్లుగా ప్రజాభిప్రాయం తెలియజేస్తోంది. రానున్న నెలల్లో టోరీల పరిస్థితులు మెరుగవుతాయని చెప్పేందుకు ఎలాంటి ఆస్కారంలేదు. ఆర్థిక పరిస్థితి సరిగా లేదని జరగనున్న ఎన్నికలే స్పష్టం చేస్తున్నాయి. గత 14ఏళ్లుగా జీవన ప్రమాణాలు ఎక్కడవేసిన గొంగళి లాగా అక్కడే ఉన్నాయి. ప్రజలుచేసే ఖర్చులను చూస్తేనే ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలుస్తోంది. ద్రవ్యోల్బణం పడిపోవడంతో జీవనం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. టోరీ పార్టీ ప్రధాన కార్యదర్శి పౌల్ నొవాక్ ఇలా చెప్పారు. "జీవన వ్యయ సంక్షోభం ఇంకా పూర్తిగా తొలగలేదు. ప్రతిరోజూ ప్రజలు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసేందుకే ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. వచ్చేఆదాయం తమ అవసరాలు తీర్చుకునేందుకే పోరాటం జరుపుతున్నారు" అని అన్నారు.

ఈ సంవత్సరం జీవనప్రమాణాలు మరింత పడిపోయాయని 58శాతం మంది ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. టోరీల 14ఏళ్ల పాలన ప్రజలకు అధ్వాన్నమైన పరిస్థితులను కల్పించింది. ఆదాయం రోజురోజుకూ తగ్గిపోతూ ప్రజలు అప్పుల పాలయ్యారు. గాజాపై ఇజ్రాయిల్ సైన్యం దాడిచేసి ప్రజలను అతిక్రూరంగా చంపుతుంటే బ్రిటీష్ ప్రభుత్వం మద్దతు ఇవ్వడంపై ప్రజలు తీవ్రమైన నిరసన తెలియజేస్తున్నారు. ఇజ్రాయిల్‌కు మద్దతు తప్పనిసరిగా ప్రభుత్వంపై ప్రభావం చూపుతోంది. వామపక్ష లేబర్‌పార్టీ అకస్మిక ఎన్నికలు స్టార్మర్ నాయకత్వంలో జరిగితే నష్టం కలగజేస్తుందేమోనని వామపక్ష లేబరుపార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అసంతృప్తిని కొందరు నాయకులు ప్రకటిస్తున్నారు. అభ్యర్థులను ఎంపిక చేయడంలోనూ సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే లేబర్‌పార్టీ నాయకుడు జర్మీ కార్బిన్‌ను నాయకుడిగా మినహాయించారు. కార్బిన్‌కి ప్రజలలో మంచి ఆదరణ ఉంది. ఈ నేపథ్యంలో ఇస్లింగ్టన్ నియోజకవర్గంనుంచి తాను ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానని గత వారం కార్బిన్ ప్రకటించారు. లేబర్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి పార్టీ అనుమతించలేదు. పార్టీకి చెందిన మరో యువ నాయకురాలు లిన్నే మహమ్మద్ ఇండిపెండెంట్‌గా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ఆమె పలస్తీనాకు చెందిన వారు. కటే దోవ్ ఇలాచెప్పారు "మనం టోరీలను ఓడిద్దాం...14ఏళ్ల కన్సర్వేటివ్‌పార్టీ అనుసరించిన పొదుపు విధానాలు బ్రిటన్‌ను ధ్వంసంచేశాయి. మనం ప్రజలకుచేస్తున్న సేవలు, ఎన్‌హెచ్‌ఎస్ విధానాలు నిధుల లభ్యతను దెబ్బతీశాయి. ప్రైవేటీకరణ చేసిన నీటి సరఫరా కలుషితమై వస్తోంది. ఇళ్ల లభ్యత సంక్షోభం పెరిగింది. కొద్దిమంది సంపన్నులు సంతోషంగా బ్యాంకుకు వెళ్లగలగుతున్నారు. ట్రేడ్‌యూనియన్ ఉద్యమం నిలకడగాఉంది. ప్రజలు ముందుగా రిషిసునాక్‌ను డౌనింగ్‌స్ట్రీట్ నుండి నెట్టివేయాలని ఇదే తమ ప్రథమ కర్తవ్యమని భావిస్తున్నారు. లేబర్‌పార్టీ ప్రభుత్వాన్ని గెలిపించనట్లయితే మన రైల్వేలను తిరిగి ప్రభుత్వరంగ సంస్థగా మార్చుకుంటాము. అలాగే శ్రమజీవులతో కొత్త ఒప్పందాన్ని చేసుకుని అమలుచేస్తాం. దేశంలో సమ్మిళితమైన సామాజిక, ఆర్థిక మార్పును తీసుకురావడానికి ప్రథమ చర్యలను చేపడతాం. టోరీలను ప్రభుత్వంనుండి దింపివేసేందుకు ప్రజలను సమీకరించడమే మన లక్ష్యం అని సోషలిస్టు, ట్రేడ్‌యూనియన్‌లు నడిపే లేబర్‌పార్టీ ఎంపీలు జరాహ్‌సుల్తానా నుంచి లాన్ లవేరి వరకు, జాన్ మక్‌డెనాల్డ్ నుంచి అప్సనా బేగం వరకు నాయకులు ప్రముఖపాత్ర వహించనున్నారు.

జార్ఖండ్‌లో 'చే'జారింది

కాంగ్రెస్ ఒంటెత్తుపోకడ

ఆ ప్రభావం ఇండియా కూటమిపై గణనీయం

అడవులకు, అపార ఖనిజ సంపదకు నిలయమైన జార్ఖండ్‌లో రాజకీయం రక్తికట్టిస్తున్నది. 14 లోక్‌సభ స్థానాలున్న ఈ రాష్ట్రంలో మే 13 నుంచి జూన్ 1 వరకు నాలుగు దశల్లో పోలింగ్ జరుగుతోంది. రాష్ట్రంలో 14 లోక్‌సభ స్థానాలున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 12 స్థానాల్లో విజయం సాధించగా, మిగిలిన రెండు స్థానాల్లో జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), కాంగ్రెస్ గెలుపొందాయి. గత లోక్‌సభ ఫలితాలనే పునరా వృతం చేయాలని బీజేపీ ఉవ్విళ్లూరుతుండగా, కాషాయ పార్టీ జోరుకు కళ్లెం వేసేందుకు విపక్షాలన్నింటినీ ఏకం చేసి ఎన్డీయే వ్యతిరేక ఓటు చీలకుండా చూడాల్సిన కాంగ్రెస్ పార్టీ ఒంటెత్తు పోకడ కారణంగా ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు కలసికట్టుగా పోటీచేయలేకపోతున్నాయి.

బీహార్ నుంచి వేరుపడి 2000 నవంబర్ 15న కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించిన జార్ఖండ్.. రాజకీయ అస్థిరతకు చిరునామాగా నిలిచింది. గత 23 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో 11 మంది ముఖ్యమంత్రులు మారారు. అందులో ఒకే ఒక్కరు పూర్తి కాలం పదవీలో ఉన్నారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి విస్పష్ట మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్ర పదో ముఖ్యమంత్రిగా రఘువర్ దాస్ బాధ్యతలు చేపట్టి ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న తొలి ముఖ్యమంత్రిగా ఘనత సాధించనున్నారు. రాష్ట్రానికి తొలి గిరిజనేతర సీఎం కూడా ఆయనే. రాష్ట్రం ఏర్పడిన అనంతరం నాలుగుసార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 2004 మినహా 2009, 14, 19 ఎన్నికల్లో బీజేపీనే అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. 2004లో కేవలం 1 లోక్‌సభ స్థానం మాత్రమే గెలుపొందిన బీజేపీ, 2009లో 7 స్థానాల్లో విజయం సాధించింది. 14, 19 ఎన్నికల్లో ఏకంగా 12 స్థానాలను కైవసం చేసుకుంది. 2004 ఎన్నికల్లో ఆరు సీట్లలో గెలుపొందిన కాంగ్రెస్... 2009, 19లో ఒక్క స్థానానికే పరిమితమైంది. 2014లో ఖాతాకూడా తెరువలేకపోయింది. మాజీ ముఖ్య మంత్రి శిబు సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నది.

రాష్ట్రంలో బీజేపీ 13 స్థానాల్లో పోటీ చేస్తున్నది. మరో స్థానాన్ని మిత్రపక్షం ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ) పార్టీకి కేటాయించింది. గతంలో తాను గెలుపొందిన నియోజకవర్గాలలో తిరిగి విజయం సాధించేందుకు బీజేపీ తీవ్రంగా శ్రమిస్తోంది. అయితే, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిన ప్రజలు బీజేపీపై తీవ్ర అసంతృప్తిని పెంచుకున్నారు. ఈ పరిస్థితులను అనుకూలంగా మలుచుకుని ఎన్నికలలో విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ సరైన వ్యూహాలను అనుసరించలేదు. ఆ పార్టీ అనుసరించిన ఒంటెత్తు పోకడల కారణంగా ఇండియా కూటమిలోని సీపీఐ, సీపీఎం విడిగా పోటీచేయాల్సి వచ్చింది.

40 ఏళ్లలో హజారీబాగ్‌లో ఒక్కసారి గెలవని కాంగ్రెస్

కేవలం కాంగ్రెస్, జేఎంఎం, ఆర్‌జేడీ, సీపీఐ (ఎంఎల్) మాత్రమే సీట్లు సర్దుబాటు చేసుకుని, సీపీఐ, సీపీఎంని దూరంబెట్టాయి. కాంగ్రెస్ 7, జేఎంఎం ఐదు, ఆర్‌జేడీ, సీపీఐ(ఎంఎల్) ఒక్కొక్క స్థానం నుంచి పోటీచేస్తున్నాయి. ఈ ఫార్ములాను సీపీఐ, సీపీఎం తీవ్రంగా వ్యతిరేకించాయి. జాతీయ పార్టీలు అయినందువల్ల తాము కూడా పోటీచేయాల్సిన అవశ్యకత ఉన్నదని నొక్కిచెప్పాయి. ఈ ధోరణి ఇండియా కూటమి ఐక్యతపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించాయి. ఇండియా కూటమి విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని పేర్కొన్నాయి. తాము పోటీచేయని చోట ఎన్డీయేను ఓడించే సామర్థ్యమున్న అభ్యర్థికి సీపీఐ, సీపీఎం మద్దతునిస్తున్నాయి. కాంగ్రెస్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. బీజేపీని ఓడించేందుకు అందరూ కలిసి రావాల్సిన అవసరం ఉందని సన్నాయినొక్కులు నొక్కుతోంది.

బాధ్యత విస్మరించిన కాంగ్రెస్: సీపీఐ విమర్శ

జార్ఖండ్‌లో ఇండియా కూటమిని కాంగ్రెస్ నిర్వీర్యం చేసిందని, వామపక్షాలకు న్యాయం చేయడం లేదని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ భువనేశ్వర్ మెహతా విమర్శించారు. రాష్ట్రంలో ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీపీఐని కూడా కలుపుకుపోతుందని ఆశించామనీ, కానీ అలా జరగలేదన్నారు. ఇండియా కూటమి ఐక్యంగా ఉండివుంటే సీపీఐ తన సొంత ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వకుండా కూటమి గొప్ప తనం ప్రచారం చేసేందుకు, కూటమి పటిష్ఠతకు కృషి చేసేదని చెప్పారు. కాంగ్రెస్, జేఎంఎం నేతల తీరు అందుకు భిన్నంగా ఉందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఒంటరిగానే పోటీ చేసి బీజేపీని ఓడించడం ఖాయమని మాజీ ఎంపీ కూడా అయిన భువనేశ్వర్ మెహతా అన్నారు. సీపీఐని కలుపుకుపోక పోవడం ఇండియా కూటమిపై ఎంత ప్రభావం చూపుతుందో రాబోయే ఎన్నికల ఫలితాలే తెలియజేస్తాయన్నారు. ఇండియా కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ కూటమి భాగస్వామ్య పార్టీలన్నింటిని కలుపుకుని ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలన్న విషయాన్ని ఆలోచించకుండా ఏకపక్ష ధోరణితో వ్యవహరించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మహేంద్ర పాఠక్ విమర్శించారు. అందుకే సీపీఐ ఇప్పుడు కూటమి గెలుపు ఓటముల గురించి చింతించకుండా తన బలాన్ని మరింత పెంచుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తోందని తెలిపారు. హజారీబాగ్ స్థానాన్ని సీపీఐకి ఇస్తే సీపీఐ విజయం సాధిస్తుందనీ, మిగిలిన నియోజకవర్గాలల్లో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలకు మద్దతు ఇస్తామనీ, తద్వారా రాష్ట్రంలో ఇండియా కూటమి విజయావకాశాలు మెండుగా ఉంటాయని సీపీఐ సీనియర్ నేతలు కాంగ్రెస్‌కు ప్రతిపాదించారని చెప్పారు. అయితే, కాంగ్రెస్ పార్టీ తన బాధ్యతలు ఏమాత్రం నిర్వర్తించలేదని, సీపీఐని పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ ప్రతిపాదనను పెడచెవిన పెట్టడమే కాకుండా బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే జై ప్రకాశ్ భాయ్ పటేల్‌కు హజారీబాగ్ టికెట్ కేటాయించడాన్ని పాఠక్ తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో తమకు చెప్పుకోతగ్గ ఓటుబ్యాంకు ఉన్నదనీ, అయినా తాము ఒక్క హజారీబాగ్ మాత్రమే అడిగామనీ, ఇవ్వడానికి కాంగ్రెస్, జేఎంఎం నిరాకరించాయని సీపీఐ మరో నేత అజయ్‌సింగ్ చెప్పారు. దానితో రాష్ట్రంలో ఒంటరిగా పోటీచేయడం తప్ప మాకు వేరే గత్యంతరం లేదన్నారు. కేంద్రంలోని నియంతృత్వ బీజేపీని తరిమికొట్టేందుకు రాష్ట్రంలోని జేఎంఎం, కాంగ్రెస్ పట్టువిడుపు ధోరణి కనిపించలేదని విమర్శించారు.

సీపీఐకి బలమైన హజారీబాగ్ లోక్‌సభ నియోజకవర్గంలో వ్యాపారవేత్త, ఫిరాయింపుదారు, ప్రజల మనిషి మధ్య త్రిముఖ పోరు జరిగింది. ఈ నియోజకవర్గంలో గతంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి యశ్వంత్ సిన్హాను ఓడించిన ఘనత సీపీఐ అభ్యర్థికి ఉంది. 1977 నుంచి హజారీబాగ్ లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ పోటీ చేస్తోంది. రెండుసార్లు శక్తివంతమైన నాయకుడు , కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి యశ్వంత్ సిన్హాను సీపీఐ అభ్యర్థి ఓడించారు. గత నలభై ఏళ్లుగా హజారీబాగ్ లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ గెలవలేకపోయింది, అయితే ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ స్థానంలో కొత్త అభ్యర్థిని రంగంలోకి దించింది. ఆ అభ్యర్థి ఇటీవలే బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. దానితో ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇద్దరూ బీజేపీకి చెందినవారే. ఈ ఫిరాయింపు రాజకీయాలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలతో విసిగిపోయిన హజారీబాగ్ నియోజకవర్గ ప్రజలు ఈ సారి సీపీఐ అభ్యర్థి అనిరుధ్ కుమార్‌ను ఎక్కువ ఓట్లతో గెలిపించి లోక్‌సభకు పంపుతారనీ, భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ రెండింటినీ ఓడించగల సత్తా భారత కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. సీపీఐ కోరిన విధంగా హజారీబాగ్ సీటు కేటాయించక పోవడమే కాకుండా రాష్ట్రంలోని వామపక్షాల మధ్య విభేదాలకు కాంగ్రెస్ పార్టీ ఆజ్యం పోయడంపై సీపీఐ, సీపీఎం శ్రేణుల ఆగ్రహంతో రగిలిపోతున్నాయి.దీని ప్రభావం రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలపై కచ్చితంగా కనిపిస్తోంది. సీపీఐ(ఎంఎల్)కు కాంగ్రెస్ పార్టీ కోడ్మెరా నియోజకవర్గం కేటాయించింది. ఈ ఎన్నికల్లో సీపీఐ హజారీబాగ్ చాత్ర, దుంకా (ఎస్టీ), లోహర్‌దఘ (ఎస్టీ), సీపీఎం రాజ్‌మహల్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నాయి.

మహిళలు 10 శాతం కన్నా తక్కువే

ఎన్నికల సమయం వచ్చే సరికి అన్ని రాజకీయ పార్టీలు మహిళా సాధికారత, చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు వంటి ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తాయి. కానీ ఎన్నికలలో పోటీచేసే మహిళల సంఖ్య మాత్రం అతి తక్కువగా ఉంటోంది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో మహిళల సంఖ్య 10 శాతం కంటే తక్కువే ఉందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) తెలిపింది. ఈసారి ఎన్నికలలో పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థులు కేవలం 797 మందేనని వెల్లడించింది. అంటే ఎన్నికలలో మొత్తం పోటీచేస్తున్న అభ్యర్థులలో 9.5 శాతం. సార్వత్రిక ఎన్నికల తొలి విడతలో పోటీచేసిన 1,618 మంది అభ్యర్థుల్లో మహిళలు 135 మంది మాత్రమే ఉన్నారు. రెండో విడతలో 1,192 మంది అభ్యర్థుల్లో 100 మంది, మూడో విడతలో 1,352 మందిలో 123, నాలుగో విడతలో 1,717 మందిలో 170, 5వ విడతలో 695 మందిలో 82 మంది మహిళలున్నారు. శనివారం పోలింగ్ జరిగే ఆరో విడతలో 869 మంది అభ్యర్థుల్లో 92 మంది మహిళలున్నారు.

ఇక చివరి, ఏడో విడతలో కూడా 904 మంది అభ్యర్థుల్లో మహిళలు కేవలం 95 మందే. మహిళా రిజర్వేషన్ల అమలుపై పార్టీల చిత్తశుద్ధి ఏపాటితో చెప్పేందుకు ఈ ఉదంతం ఒక్కటి చాలని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఈసారి మొత్తం 8,337 మంది అభ్యర్థులు లోక్‌సభ ఎన్నికలలో పోటీచేస్తున్నారు. ఇంతమంది పోటీలో ఉండటం 1996 తర్వాత ఇదే మొదటిసారి. 1996లో రికార్డు స్థాయిలో 13,952 మంది అభ్యర్థులు పోటీ చేశారు.

గవర్నర్‌పై చర్యలు తీసుకోండి

ఈసీకి తృణమూల్ కాంగ్రెస్ ఫిర్యాదు

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనంద బోస్‌పై కేంద్ర ఎన్నికల సంఘాని(ఈసీ)కి అధికార తృణమూల్ కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా గవర్నర్ ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. ఇందులో భాగంగానే కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ తన ఛాతీపై బీజేపీ పార్టీ గుర్తుతో కనిపించారని ఫిర్యాదులో పేర్కొంది. 'పశ్చిమ బెంగాల్ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ తన పదవిని సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ప్రచారం చేసేందుకు ఉపయోగిస్తున్నారు. 23.01.2024న కోల్‌కతాలోని రామ్ టెంపుల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ తన ఛాతీపై బీజేపీ లోగోను ధరించి కనిపించారు' అని తృణమూల్ పార్టీ ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. గవర్నర్ ప్రవర్తన అప్రజాస్వామికమని, రాజ్యాంగ విలువలను కాలరాస్తున్నారని పేర్కొంది. గతంలో కూడా తమ కార్యాలయాలను రాజకీయ పార్టీల ప్రచారానికి వినియోగించుకున్న గవర్నర్లపై భారత ఎన్నికల సంఘం చర్యలు తీసుకుందని తృణమూల్ ఎత్తిచూపింది. 'ఉదాహరణకు 1993లో హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ గుల్షేర్ అహ్మద్... తన కుమారుడి ఎన్నికల ప్రచారానికి అధికారిక యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసినందుకు అతనిపై కమిషన్ చర్య తీసుకుంది. ఈసీఐ చర్య తీసుకున్న వెంటనే అహ్మద్ తన పదవికి రాజీనామా చేశారు' అని తెలిపింది. ఇక 2019లో అప్పటి రాజస్థాన్ గవర్నర్ కళ్యాణ్ సింగ్, నరేంద్ర మోదీని ప్రధానిగా తిరిగి ఎన్నుకోవాలని వ్యాఖ్యానించగా...ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై రాష్ట్రపతికి ఫిర్యాదును పంపిందని గుర్తు చేస్తూ... పశ్చిమబెంగాల్ గవర్నర్ ఆనందబోస్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. గవర్నర్‌ను రాష్ట్రపతి నియమించే వ్యక్తి అని, ఆయన రాజకీయ భావజాలానికి లేదా కేంద్రంలోని ప్రభుత్వ రాజకీయ దృక్పథానికి ప్రాతినిధ్యం వహించాల్సిన అవసరం లేదని టీఎంసీ తన ఫిర్యాదులో స్పష్టం చేసింది. గవర్నర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని మరియు ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోకుండా నిరోధించాలని ఎన్నికల సంఘాన్ని కోరింది.

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడే ఎన్నికలు

ఇండియా కూటమిని గెలిపించండి

ఢిల్లీ ఓటర్లకు సోనియా విజ్ఞప్తి

న్యూఢిల్లీ: దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు చాలా ముఖ్యమైన ఎన్నికలని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పేర్కొన్నారు. గురువారం ఆమె 'ఎక్స్' వేదికగా ఢిల్లీ ఓటర్లను ఉద్దేశించి ఓ వీడియో సందేశం పోస్ట్ చేశారు. ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాల్లో కాంగ్రెస్, ఇండియా కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. "ఇవి చాలా ముఖ్యమైన ఎన్నికలు. ఈ ఎన్నికలు దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడే ఎన్నికలు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రాజ్యాంగ సంస్థలపై దాడి వంటి సమస్యలపై ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ పోరాటంలో మీరు మీ వంతు పాత్ర పోషించాలి" అని ఢిల్లీ ఓటర్లకు సోనియా పిలుపునిచ్చారు. ఇండియా కూటమి అభ్యర్థులకు వేసే ప్రతి ఓటు ఉపాధిని సృష్టిస్తుందని, మహిళలకు సాధికారత కల్పిస్తుందని, ధరలు తగ్గుతాయని, సమానత్వం, ఉజ్వల భవిష్యత్తుతో కూడిన భారతదేశాన్ని సృష్టిస్తుందని ఆమె తెలిపారు. ఢిల్లీలో మే 25న ఓటింగ్ జరగనుండగా... జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. నగరంలో ఎన్నికల ప్రచారానికి పార్టీలకు గురువారం చివరి రోజు.

హర్యానాలో కాంగ్రెస్ గాలి: ప్రియాంక

సిర్సా (హర్యానా): హర్యానాలో నిరుద్యోగం, అవినీతి, ద్రవ్యోల్బణ పరిస్థితులకు రానున్న ఎన్నికల్లో బీజేపీ భారీ మూల్యం చెల్లించుకోనుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ తెలిపారు. హర్యానాలో కాంగ్రెస్ గాలి ఉధృతంగా వీస్తోందని... లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఘన విజయం తథ్యమని స్పష్టం చేశారు. దేశంలోనే అత్యధిక నిరుద్యోగం హర్యానాలో ఉందని తెలిపారు. హర్యానాలో అధిక ధరలు, అవినీతి, అస్థిరతతో ప్రజలు విసిగిపోయారన్నారు. వారు పెద్ద మార్పును తీసుకోరాబోతున్నారని 'ఎక్స్' వేదికగా హిందీలో ట్వీట్ చేశారు. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలుస్తుందని ఆమె తెలిపారు. అంతకుముందు హర్యానాలోని సిర్సాలో పార్టీ అభ్యర్థి కుమారి సెల్జాకు మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు. నాయకత్వం వహించారు. సెల్జా , హర్యానా మాజీ మంత్రి కిరణ్ చౌదరితో కలిసి ఓపెన్ టాప్ వాహనంలో నిలబడి సుమారు గంటపాటు పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. ఆమెకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలకగా... వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పార్టీ జెండాలు పట్టుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు 'కాంగ్రెస్ పార్టీ జిందాబాద్' అంటూ నినాదాలు చేస్తూ ఆమెపై పూల వర్షం కురిపించారు. లోక్‌సభ ఎన్నికల ఆరో దశ ఎన్నికల ప్రచారం ముగియడానికి కొన్ని గంటల ముందు ఈ రోడ్‌షో జరిగింది. హర్యానాలో కాంగ్రెస్‌కు చెందిన దళిత వర్గానికి చెందిన సెల్జా, బీజేపీ అభ్యర్థి అశోక్ తన్వర్‌తో పోటీ పడుతున్నారు. హర్యానాలో ఈ నెల25న ఎన్నికలు జరగనున్నాయి.

పాలే లేవు... నెయ్యి కోసం ఘర్షణ

ఇండియా కూటమిపై మోదీ ఆరోపణలు

చండీగఢ్: సార్వత్రిక ఎన్నికల సమరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో ప్రధాని మోదీ విపక్ష 'ఇండియా' నేతలపై విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా ఆయన హర్యానాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. విపక్ష కూటమి గురించి మాట్లాడుతూ ఆవు ఇంకా పాలు ఇవ్వనేలేదు. కానీ, అక్కడ నెయ్యి కోసం ఘర్షణ మొదలైందని వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి పదవిని ఉద్దేశించి ఆయన ఈ మాటన్నారు. అలాగే ఐదు సంవత్సరాలకు ఐదుగురు ప్రధానులు అని వారే చర్చించుకుంటున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో మీ ఓటు ప్రధానిని ఎన్నుకోవడంతో పాటు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ఒక వైపు మీరు పరీక్షించిన సేవకుడు మోదీ ఉన్నాడు.. అవతలివైపు ఉన్న కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తున్నారో తెలీదని ప్రజలను ఉద్దేశించి మోదీ చెప్పారు.

ఇండియా కూటమిలో కులతత్వం, మతతత్వం, బంధుప్రీతి ఎక్కువని, మోదీ ఉన్నంతకాలం దళితులు, గిరిజనుల రిజర్వేషన్లను ఎవరూ దోచుకోలేరని చెప్పారు. హర్యానా ప్రజలు తనపై ఎంతో ప్రేమ కురిపించారని, ఇక్కడి ప్రజలతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని మోదీ అన్నారు. 1962లో మనం చైనా చేతిలో ఓటమి చవిచూశామని, ఆ ఓటమికి వారు(కాంగ్రెస్) సైన్యాన్ని బాధ్యుల్ని చేశారని, మన మిలిటరీని కించపరిచే అవకాశాల కోసం ఆ పార్టీ ఇప్పటికీ ఎదురుచూస్తోందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో రాత్రికిరాత్రి ముస్లింలకు ఓబీసీ సర్టిఫికెట్లు జారీ చేశారని, వాటిని అందుకున్నవారిలో చొరబాటుదారులు కూడా ఉన్నారన్నారు. ఇప్పుడు అవి చెల్లవని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. విపక్ష పార్టీలు అధికారంలోకి వస్తే... తమ హయాంలో జరిగిన అభివృద్ధి ఫలాలను వారి ఓటు బ్యాంక్‌కు అప్పగిస్తారని ఆరోపించారు.

బీహార్‌కు మోదీ నమ్మకద్రోహం: మీసా భారతి

పాట్నా: ప్రధాని నరేంద్ర మోదీ నయవంచనతో బీహార్‌ను నట్టేట ముంచారని పాటలీపుత్ర లోక్‌సభ నియోజకవర్గ ఆర్జేడీ అభ్యర్థి మీసా భారతి ఆరోపించారు. మోదీ పాటలీపుత్ర రావడం స్వాగతిస్తున్నామని, ఆయన రాకతో ఆ పార్టీకి రావాల్సిన మరో 5,000 నుంచి 10,000 ఓట్లు రాకుండా పోతాయని అన్నారు. బీహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా, ప్రత్యేక ప్యాకేజ్ ప్రకటిస్తామని కాషాయ పాలకులు ఊదరగొట్టి ఉసూరుమనిపించారని ఆరోపించారు. బీహార్‌లో యువతకు ఉపాధి పేరిట అనేక కర్మాగారాలు ప్రారంభిస్తామని గొప్పలు చెప్పారని గుర్తుచేశారు. తేజస్వీ యాదవ్ యువతకు పెద్దసంఖ్యలో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకువచ్చారని అన్నారు.17 ఏళ్లుగా సాధ్యం కాని పనులను తేజస్వీ యాదవ్ 17 నెలల్లో సాధించారని చెప్పారు. తేజస్వి కేవలం ఏడాదిన్నరలోనే 5 లక్షల ఉద్యోగాలను యువతకు అందించారని తెలిపారు. తేజస్వి చేపట్టిన పనులతో ప్రజల్లో ఆయన పట్ల విశ్వాసం, నిలకడ ఉన్నట్లు వెల్లడవుతోందని ఆమె చెప్పారు.

మూడు హోటళ్లకు బాంబు బెదిరింపు

బెంగళూరు: కర్నాటక రాజధాని బెంగళూరులో ఉన్న మూడు పెద్ద హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంట్లో ప్రఖ్యాత ఒటెరా హోటల్ కూడా ఉన్నది. ఒటెరా హోటల్ వద్ద బాంబు స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించినట్లు సౌత్ ఈస్ట్ బెంగళూరు డీసీపీ తెలిపారు. బుధువారం ఢిల్లీలో కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. నార్త్ బ్లాక్ ప్రాంతంలో ఆ కాల్స్ వచ్చినట్లు తేలింది. హోంమంత్రి ఆఫీసు ఉండే ఆ ప్రాంతంలో బెదిరింపులు వచ్చాయి. కానీ ఆ బెదిరింపులు ఉత్తవే అని అధికారులు గుర్తించారు. మే 14వ తేదీన బెంగళూరులోని 8 స్కూళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. ఆ కాల్స్ కూడా నకిలీవని అధికారులు తేల్చారు.

అవతార పురుషుడికి పేదలు పట్టరా!

- మోదీలా సామాన్యుడు మాట్లాడితే మానసిక రోగి అంటారు
- రాహుల్ గాంధీ విమర్శ
- కన్హయ కుమార్‌కు మద్దతుగా దిల్లీలో ప్రచారం

న్యూదిల్లీ: 'మన ప్రధాని ఈ మధ్య మాట్లాడుతన్నట్లు ఎవరైన సామాన్యుడు మాట్లాడితే అతనిని నేరుగా మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళతారు' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. అవతార పురుషుడినని చెప్పుకునే మోదీ కేవలం 22 మంది కోసం పనిచేస్తారని దుయ్యబట్టారు. పేదల కోసం చేసినది శూన్యమని వ్యాఖ్యానించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం దేశ రాజధాని దిల్లీలోని లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగబోతోంది. గురువారంతో ప్రచారం ముగిసింది. దీంతో చివరి రోజు అన్ని పార్టీలు పోటాపోటీగా ప్రచారాన్ని సాగించాయి. ఇదే క్రమంలో ఈశాన్య దిల్లీ నుంచి ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న కన్హయ కుమార్‌కు మద్దతుగా రాహుల్ గాంధీ ప్రచారం చేశారు. దిల్షద్ గార్డన్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీపై బీజేపీ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు.

'నాది సాధారణ జన్మకాదు... నాకు దేవుడు ఆయన పనులు చేసేలా శక్తి ఇస్తాడు' అని ఓ ఇంటర్వ్యూలో మోదీ చెప్పడాన్ని రాహుల్ విమర్శించారు. తనను తాను అవతార పురుషుడిని ప్రధాని చెప్పుకోవడాన్ని దుయ్యబట్టారు. 'దేవుడు పంపిన వ్యక్తి కేవలం 22 మంది కోసమే పనిచేయడం విడ్డూరంగా ఉంది. అంబానీ, అదానీ కోరినట్లు ప్రధాని మోదీ వ్యవహరిస్తారు. దేశ ఆస్తులన్నీ ఇచ్చేస్తారు. రైల్వే, నౌకాశయాలు, విమానాశ్రయాలు తదితరాలన్నీ అదానీ వశపరుస్తారు. రుణమాఫీ, రోడ్లు, ఆసుపత్రులు, విద్య వంటివి పేదలు అడిగినా పట్టించుకోరు' అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని మార్చాలన్నదే బీజేపీ చిరకాల వాంఛని రాహుల్ అన్నారు. దానిని చించి పారేయాలని బీజేపీ తహతహలాడుతోందని విమర్శించారు. 'వీరు (బీజేపీ) భారత రాజ్యాంగాన్ని, జాతీయ జెండాను ఎన్నడూ స్వీకరించలేదు. రాజ్యాంగాన్ని మార్చాలన్న కోరికను ఈ ఎన్నికల్లో బహిర్గతం చేశారు. తాజా ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణ కోసం జరిగే సమరం. రాజ్యాంగం సాధారణ పుస్తకం కాదు. కొన్ని వేల సంవత్సరాలకు సైద్ధాంతిక సంపద. గాంధీ, అంబేద్కర్, నెహ్రూ వంటివారి ఆలోచనలు, దార్శనికతతో రూపుదిద్దుకున్నది' అని రాహుల్ ఉద్ఘాటించారు. రాజ్యాంగాన్ని మార్చాలని భావిస్తే ప్రతిపక్షాలతో పాటు కోట్లాది మంది ప్రజల నుంచి ప్రతిఘటన తప్పబోదని బీజేపీని హెచ్చరించారు.

ఆంధ్రాభవన్‌లో...

దేశంలో ఏం జరుగుతుందో ప్రజలు గమనిస్తున్నారని, తమ వజ్రాయుధమైన ఓటుతో బీజేపీకి బుద్ధి చెబుతారని రాహుల్ గాంధీ అన్నారు. దేశ సంపదను తన కోవర్టులకు మోదీ దోచి పెడుతున్నారని, దేశ సంపద అదానీ, అంబానీ చేతిలో కేంద్రీకృతమైందని విమర్శించారు. జూన్ 4న ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని దీమాగా చెప్పారు. రాహుల్ దిల్లీలోని ఆంధ్రాభవన్‌కు వెళ్లి అక్కడి ఆంధ్రా క్యాంటీన్‌లో భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యపర్చనున్నట్లు తెలిపారు. ఎన్డీయే మూడోసారి అధికారంలోకి రావడం కల్ల అన్నారు. దిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాల్లో ఇండియా కూటమి అభ్యర్థులు గెలుస్తారని విశ్వాసంగా చెప్పారు. భారత రాజ్యాంగం మార్చాలని, రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ భావిస్తోందని తెలిపారు. దేశం పేదల సంక్షేమానికే ఇండియా కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని హామీనిచ్చారు.

నా తల్లిదండ్రుల్ని ఎందుకు వేధిస్తున్నారు

ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సూటిప్రశ్న

న్యూదిల్లీ: అనారోగ్యంతో ఉన్న తన వృద్ధ తల్లిదండ్రులను ఎందుకు వేధిస్తున్నారని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రశ్నించారు. గురువారం ఆయన వర్చువల్‌గా మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ప్రధాని అనారోగ్యంతో ఉన్న తన తల్లిదండ్రు లను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ఈ విధంగా చేయడం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ అన్ని హద్దులను అధిగమించారన్నారు. స్వాతి మలివాల్‌పై దాడి కేసుకు సంబంధించి పోలీసులు తన తల్లిదండ్రులను విచారించబోతున్నారని కేజ్రీవాల్ గతంలో చెప్పారు. 'ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు నా ఎమ్మెల్యేలను అరెస్టు చేశారు, కానీ నేను చలించలేదు. మీరు నా మంత్రిని అరెస్టు చేశారు కానీ మీరు నన్ను లొంగదీసుకోలేకపోయారు. మీరు నన్ను అరెస్టు చేయించి... జైలులో పెట్టి వేధించారు' అని ఆయన అన్నారు. 'కానీ ఈరోజు నువ్వు అన్ని హద్దులు దాటావు. నన్ను లొంగదీయడానికి అనారోగ్యంతో ఉన్న నా వృద్ధ తల్లిదండ్రులను మీరు లక్ష్యంగా చేసుకున్నారు. మా అమ్మ అనేక అనారోగ్యాలతో బాధపడుతోంది. నన్ను అరెస్టు చేసిన రోజు (మార్చి 21), ఆమె ఆసుపత్రి నుండి తిరిగి వచ్చింది. మా నాన్నకు 85 సంవత్సరాలు, నా తల్లితండ్రుల్ని దోషులుగా భావిస్తున్నారా? నా తల్లిదండ్రుల్ని ఎందుకు వేధిస్తున్నారు?' అని ప్రధాని మోదీని కేజ్రీవాల్ ప్రశ్నించారు. మే 13న ముఖ్యమంత్రి నివాసంలో ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్‌పై జరిగిన దాడికి సంబంధించి కేజ్రీవాల్ తల్లిదండ్రులను ప్రశ్నించడానికి దిల్లీ పోలీసులు ఆయన ఇంటికి వెళ్లకపోవచ్చని అంతకు ముందు సంబంధిత వర్గాలు తెలిపాయి. తన వృద్ధ తల్లిదండ్రులను గురువారం పోలీసులు విచారించబోతున్నారని బుధవారం కేజ్రీవాల్ చెప్పారు. స్వాతి మలివాల్‌పై దాడి కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు విభవ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసిన సంగతి విదితమే. ఈ విషయంలో న్యాయమైన దర్యాప్తును ఆశిస్తున్నానని, ఈ కేసులో న్యాయం జరగాలని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం తినాలి

తిరుపతి తాజ్ హోటల్ వంట నిపుణులతో ప్రత్యేక వీడియోలు: ప్రవీణ్ ప్రకాశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం తినేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్... డీఈవోలను ఆదేశించారు. మెనూలో వివిధ వంటకాల తయారీపై గురువారం తిరుపతిలోని తాజ్ హోటల్ వంట నిపుణుల సహకారంతో శిక్షణా వీడియోలను రూపొందించారు. ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ, ప్రతి రోజు రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాలను ఎలా తయారు చేయాలో, తద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ ప్రత్యేక వీడియోలను రూపొందించామన్నారు. ఆరు వీడియోలను రూపొందించి గోరుముద్ద ఆంధ్రా యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేశామని వివరించారు. అందులో భాగంగా సోమవారం మెనూకు సంబంధించిన ఒక వీడియో లింక్‌ను విడుదల చేశామన్నారు. రాష్ట్రంలోని 44,190 పాఠశాలల్లో 85,000 మంది వంట వాళ్లు ఈ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రధానోపాధ్యాయులకు తెలియజెప్పాలని డీఈవోలకు ఆయన సూచించారు. పాఠశాలలన్నింటిలోనూ అందించే ఆహారం నాణ్యత, రుచిని నిర్ధారించడమే తమ లక్ష్యమన్నారు. సమిష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 90శాతం మంది విద్యార్థులు భోజనం చేస్తుండగా, 10 శాతం మంది ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నారని, అది పాఠశాల వాతావరణానికి హానికరమని చెప్పారు. విద్యార్థులంతా కలిసి భోజనం చేయడం, ఆడుకోవడం ద్వారా వారిలో టీమ్ స్పిరిట్, సహచర్యం పెరుగుతాయని అన్నారు. ఇవి విద్యార్థి భావోద్వేగ మేధస్సుకు చాలా కీలకమన్నారు. జూన్‌లో జరిగే తల్లిదండ్రుల- ఉపాధ్యాయుల గృహసందర్శనలో ఈ విషయాన్ని చర్చించేలా సంబంధిత తరగతి ఉపాధ్యాయులు చూడాలని అన్నారు.

బౌద్ధ మార్గం అనుసరణీయం: జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): ప్రపంచ మానవాళికి బౌద్ధ మార్గం స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జల్లి విల్సన్ అన్నారు. గౌతమ బుద్ధుడి జయంతిని పురస్కరించుకుని గురువారం దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో బుద్ధుని విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ... అఖండ భారత దేశంలో గౌతమ బుద్ధుడు జన్మించడం మనకు గర్వకారణమని అన్నారు. క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దంలో నేపాల్‌లోని లుంబినిలో శాక్య రాజ్యానికి యువరాజుగా, వారసుడిగా బుద్ధుడు... సిద్ధార్థ గౌతముడిగా విశాఖ శుద్ధ పౌర్ణమి రోజున జన్మించాడని వివరించారు. అదే రోజున బౌద్ధాన్ని స్వీకరించి గయలోని బోధి వృక్షం కింద కూర్చుని లోతైన ధ్యానసముద్రంలో ... అహం యొక్క భ్రమ్మలను అధిగమించి, జ్ఞానోదయం పొందారని చెప్పారు. అదే రోజు అంతర్ధానం చెందటం యాదృచ్ఛికమన్నారు. యుద్ధోన్మాదైన అశోక చక్రవర్తి కళింగ యుద్ధ మారణ హోమం తర్వాత చలించి, శాంతి కాముకుడై బౌద్ధ మతాన్ని స్వీకరించి విశ్వయాప్తికి తోడ్పడ్డాడని పేర్కొన్నారు. మన జాతీయ పతాక పై అశోక ధర్మ చక్రాన్ని చిహ్నంగా ఉండటం మనకు, భారత జాతికి గర్వకారణమన్నారు. ప్రపంచ దేశాలలో బౌద్ధ బోధనలను ఆచరించి, కొనసాగించటం ఆదర్శనీయమన్నారు. డీహెచ్‌పీఎస్ నగర కార్యదర్శి బుట్టి రాయప్ప, అధ్యక్షుడు సంగుల పేరయ్య, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొడాలి ఆనందరావు, కాళ్ల చిన్నప్ప, శాంతమ్మ, సీపీఐ ఏడో డివిజన్ కార్యదర్శి అప్పరబోతు రాము, సభ్యులు పూసర్ల లక్ష్మణరావు, ప్రసన్న కుమార్, కాకుమాల జోసెఫ్, చిరంజీవి బుట్టి గౌతమ్ జోయల్, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు యలమందరావు పాల్గొన్నారు.

పాలిగ్రాఫ్ పరీక్షకు సిద్ధం: మలివాల్

న్యూదిల్లీ: తనపై అనుమానముంటే పాలిగ్రాఫ్ పరీక్ష చేయించవచ్చు అని ఆప్ ఎంపీ స్వాతి మలివాల్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తనపై చేస్తున్న ఆరోపణలను ఖండించారు. దాడి జరిగిన రోజు భద్రతా సిబ్బందితో సీఎం నివాసంలో గొడవ పడుతున్నట్లుగా ఆప్ విడుదల చేసిన వీడియోల విశ్వసనీయతను ప్రశ్నించారు. స్వాతి మలివాల్ గురువారం ఓ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. తనపై దాడి గురించి మాట్లాడారు. ఆప్ ఆరోపణల క్రమంలో పోలీసులతో పాలిగ్రాఫ్ పరీక్ష చేయించుకునేందుకు సిద్ధమేనని చెప్పారు. 'సీసీటీవీ ఫుటేజిని చూసి ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. చూడండి ఎలా నడుస్తోంది. ఎలా మాట్లాడుతోంది అంటున్నారు. అది ఎడిట్ చేసిన వీడియో. ఎవరైనా మిమ్మల్ని కొడితే మీరు ముందుగా ఎలా స్పందిస్తారు. ఆగ్రహావేశానికి లోనవుతారు కదా! నొప్పిని లెక్కచేయకుండా ఎదుటి వ్యక్తిపై విరుచుకుపడరా' అని మలివాల్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు తమకు సీసీటీవీ ఫుటేజి లభించలేదని దిల్లీ పోలీసులు అంటున్నారని, దీనిని బట్టి ఈ ఫుటేజి సరైనదేనా అన్న సందేహం కలగుతుందని అన్నారు. 'నాకు ఏం జరిగిందో అదే ఫిర్యాదులో పేర్కొన్నాను. బట్టలు చినిగాయని, తలకు గాయమైందని ఎప్పుడు చెప్పాను' అంటూ ప్రశ్నించారు. తప్పు తనవైపు ఉన్నట్లు భావిస్తే పాలిగ్రాఫ్ పరీక్షకు సిద్ధమని, అయితే దానిని పోలీసులే నిర్వహించాలని అన్నారు.

చలో దిల్లీకి 100 రోజులు

- శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్దకు రైతులు
- పటియాలాలో మోదీ సభా వేదిక వరకు మార్చ్?
- భారీగా పోలీసుల మోహరింపు-మార్గాలన్నీ మూసివేత

అంబాలా/పాటియాలా: తమకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైన ప్రధాని మోదీని నిలదీసేందుకు రైతులు సిద్ధమయ్యారు. 'చలో దిల్లీ'కి 100 రోజులైన సందర్భంగా పెద్ద సంఖ్యలో శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి ర్యాలీలా ప్రధాని ప్రచార సభ జరగబోయే పటియాలాలోని పోలో మైదానానికి మార్చ్ నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో అప్రమత్తమైన పటియాలా యంత్రాంగం భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేసింది. 2022లో జరిగిన ఫిరోజ్‌పూర్ తరహా ఘటన పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంది. 5,500 మందికిపైగా పోలీసులను నగరంలో మోహరించింది. మోదీ సభ జరగబోయే పోలో మైదానానికి వెళ్లే నాలుగు మార్గాలను అధికారులు మూసివేశారు. సెక్యూరిటీ పాస్‌లు చూపిస్తేనే ప్రవేశం లభించేలా ఏర్పాట్లు చేశారు. పటియాలాను కలిపే రోడ్లలోనూ భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రధాని ర్యాలీ జరిగే ప్రాంగణానికి వెళ్లే ప్రతి వ్యక్తిని తనిఖీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో దిల్లీ చలోను రైతులు నిర్వహించారు. నాటి నుంచి తమ పెండింగ్ డిమాండ్ల పరిష్కారం, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కి చట్టబద్ధత కోసం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో దశలవారీ నిరసనలు, ఆందోళనలు, నిర్వహిస్తూనే ఉన్నారు. చలో దిల్లీకి 100 రోజులు పూర్తి కావడం, పటియాలా నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించేందుకు మోదీ రావడంతో ఆయనను నేరుగా ప్రశ్నించాలని రైతులు భావించినట్లు ఎస్‌కేఎం, కేఎంఎం నేతలు తెలిపారు. శంభు, ఖనౌరీ, దబ్వాలీ సరిహద్దుల వద్ద రైతులు చేరుకున్నట్లు కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ నాయకుడు శర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు. తమను దిల్లీలోకి రానివ్వకుండా కేంద్రప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. పంజాబ్, హర్యానా సరిహద్దుల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఎంఎస్పీకి చట్టబద్ధమైన హామీనిస్తూ ఆర్డినెన్స్‌ను కేంద్రం వెంటనే తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ప్రధాని పాటియాలా పర్యటనను పురస్కరించుకొని ఆయనను నిలదీయాలని రైతులు భావించినట్లు తెలిపారు. తమకు అవకాశం లభించకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

జూన్ ఒకటో తేదీన పంజాబ్‌లోని 13 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో పటియాలా నుంచి ఎన్నికల ప్రచారాన్ని మోదీ మొదలు పెట్టారు. ఇదిలావుంటే పంజాబ్‌లో బీజేపీ అభ్యర్థులకు అడుగడుగున నిరసనలు ఎదురవుతున్నాయి. ప్రచారానికి వెళ్లే ప్రతి చోట రైతులు వారిని నిలదీస్తున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించనందుకు నల్ల జెండాలు చూపుతున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలం కావడం, తమను దిల్లీలోకి రానివ్వకపోవడంతో మోదీ ప్రభుత్వంపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తాజా ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం నేర్పాలని సంకల్పించారు.

దుర్గామల్లేశ్వరస్వామి ట్రస్ట్‌కు ఎల్‌బీఎఫ్ భూరి విరాళం

విజయవాడ: విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి అన్నదాన ట్రస్ట్‌కు లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఎల్‌బీఎఫ్) అడ్వైజరీ సర్వీసెస్‌వారు లక్షా వెయ్యి నూట పదహారు రూపాయల విరాళాన్ని అందజేశారు. సంస్థ చైర్మన్ దుర్గాప్రసాద్, సీఈవో శివాని, కృష్ణాజిల్లా బ్రాంచ్ మేనేజర్ ఎన్ఎస్. రామాంజనేయులు, హెడ్ ఆఫీస్ బ్రాంచ్ మేనేజర్ ఏపీ కేశవరావు, ఇన్‌చార్జ్ సురేష్ బాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బంగ్లా ఎంపీ హత్యకు రూ.5 కోట్లు సుపారీ

కోల్‌కతా: బంగ్లాదేశ్‌కు చెందిన ఎంపీ అన్వరుల్ అజీమ్ అనార్ కోల్‌కతాలో హత్యకు గురయ్యారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఎంపీ అన్వరుల్‌ను చంపేందుకు అతని మిత్రుడే రూ.5 కోట్లు ఇచ్చినట్లు పశ్చిమ బెంగాల్ సీఐడీ తెలిపింది. మే 13వ తేదీ నుంచి అన్వరుల్ అదృశ్యమయ్యారు. ఈ కేసులో బెంగాల్ సీఐడీ దర్యాప్తు చేపట్టినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. పక్కా పథకం ప్రకారమే హత్య చేశారని, ఇందుకుగాను భారీ మొత్తంలో డబ్బు చేతులు మారిందని, ఆ ఎంపీని చంపేందుకు అతని పాత మిత్రుడే రూ.5 కోట్లు ఇచ్చినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు. ఆ ఎంపీ మిత్రుడు అమెరికా జాతీయుడని, అతనికి కోల్‌కతాలో కూడా ఫ్లాట్ ఉన్నట్లు ఆ అధికారి చెప్పారు. అన్వరుల్‌ను హత్య చేసినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని సీఐడీ ఐజీ అఖిలేశ్ చతుర్వేది తెలిపారు.

ధాన్యం, మొక్కజొన్న రైతులకు డబ్బులు ఇప్పించండి: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ధాన్యం, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేసిన వ్యాపారి నుంచి రైతులకు రావాలసిన డబ్బు ఇప్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో బాధిత రైతులతో కలిసి జిల్లా అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-2024 ఖరీఫ్‌కు సంబంధించి వివిధ రైతుల నుండి ధాన్యం, మొక్కజొన్న పంటలను శ్రీ బాలాజి ఎంటర్‌ప్రైజెస్, గుంటూరు ప్రొ.ఎస్.గుర్నాధం అనే వ్యాపారి కొనుగోలు చేసి రైతులకు డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నారని తెలిపారు. వారి ఆఫీసుకు వెళ్లి రైతులు డబ్బులు అడగ్గా... రేపు, ఎల్లుండి అంటూ వాయిదాలు వేస్తూ... ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కొంతమంది రైతులకు ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అయ్యాయని తెలిపారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన నెల్లూరి సుబ్బారావు, మంగళగిరి మండలం నిమమ్రు గ్రామానికి చెందిన మర్రెడ్డి సాంబిరెడ్డి, తాడికొండకు చెందిన గోగినేని హరిబాబు, బాపట్ల జిల్లా అమృతలూరి మండలం పాంచాలవరం గ్రామానికి చెందిన లాం హరనాధ బాబు, కొట్టూరు మండలం వల్లభాపురానికి చెందిన రాంబాబు మొదలగు వారికి డబ్బులు రావలసి ఉందని తెలిపారు. గుర్నాధం నుండి వాటిని ఇప్పించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి పూర్ణచంద్రరావు, రైతు సంఘం నాయకులు నెల్లూరి సుబ్బారావు, ఎం.శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడోసారీ మేమే గెలుస్తాం: నిర్మలా సీతారామన్

న్యూదిల్లీ: బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి కొలువు తీరుతుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు స్థిరమైన ప్రభుత్వం కావాలని బలంగా కోరుకుంటున్నారని తెలిపారు. గత 10 ఏళ్లుగా ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ ఏం చేశారో దేశప్రజలకు తెలుసునని చెప్పారు. న్యూదిల్లీలో గురువారం విలేకరులకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. ఎన్నికల వేళ పోలింగ్ కేంద్రాలకు భారీగా మహిళలు, యువత బారులు తీరి మరీ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. దీంతో వారి ఉద్దేశ్యమేమిటో అర్థమవుతుందని పేర్కొన్నారు. మోదీ తీసుకు వచ్చిన పథకాల ద్వారా మహిళలు లబ్ధిపొందారని ఆమె వివరించారు.

పతంజలిపై క్రిమినల్ కేసు

3న విచారణకు రావాలి: కేరళ కోర్టు ఆదేశాలు

కోజికోడ్: పతంజలి ఆయుర్వేద సంస్థ ఆంగ్ల, మలయాళం పత్రికల్లో తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తున్నదంటూ కేరళ కోర్టులో క్రిమినల్ కేసు దాఖలైంది. కోజికోడ్‌లోని జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు దీనిపై జూన్ 3న విచారణ చేపట్టనున్నది. ఆ రోజు కోర్టు ఎదుట హాజరు కావాలని సంస్థ వ్యవస్థాపకులు బాబా రామ్‌దేవ్, ఆచర్య బాలకృష్ణకు ఆదేశాలు జారీచేసింది. పతంజలి ఉత్పత్తులను విక్రయించే దివ్యా ఫార్మసిపై ఈ ఏడాది ఏప్రిల్‌లో డ్రగ్స్ ఇనస్పెక్టర్ పెట్టిన కేసు క్రమంలో సుప్రీంకోర్టులో ఈ సంస్థకు చుక్కెదురైంది. చీవాట్లు పెట్టిన సర్వోన్నత న్యాయస్థానం పతంజలితో బహిరంగ క్షమాపణ చెప్పించింది. వ్యక్తిగత పేషీ నుంచి ఇటీవల మినహాయింపు కల్పించింది. తాజాగా కేరళలోనూ తప్పుడు ప్రకటన అంశమై క్రిమినల్ కేసు నమోదు కాగా జూన్ 3న ఇద్దరు నిందితులు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుందని జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలు జారీచేసింది.

రసాయన కర్మాగారంలో పేలుడు... ఏడుగురి మృతి

ముంబై: మహారాష్ట్రలోని రసాయన కర్మాగారంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. థానే జిల్లా డోంబివిలిలో గల కర్మాగారంలో నాలుగు బాయిలర్లు పేలడంతో ఒక్కసారిగా మంటలు ఎగసి పడ్డాయి. నిల్వ ఉన్న రసాయనాలకు అంటుకున్నాయి. దాంతో భారీగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించినట్టు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే కర్మాగారంలో ఉన్న కొందరిని రక్షించినప్పటికీ ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందారు. మరో 48 మందికి గాయాలు అయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది 10 ఫైరింజన్లతో గంటల తరబడి శ్రమించి మంటల్ని అదుపులోకి తెచ్చారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశముంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.